VISALAANDHRA VIJAYAWADA PHONE No 376

6 పేజీలు 7 నయాపైసలు రిజిష్టర్డు నెం A 203

ఏప్రిల్ తరవాతనే 244 సార్లు పాకిస్తాన్‌చే యుద్ధవిరమణశ్రేణి ఉల్లంఘన

న్యూఢిల్లీ, ఆగస్టు 31

ఈసాల ఏప్రిల్ తరవాతనే పాకిస్తాన్ కాశ్మీర్‌లో యుద్ధవిరమణశ్రేణిని 244 సార్లు ఉల్లంఘించిందని ప్రధానమంత్రి లోక్‌సభలో ఒక ప్రశ్నకు యిచ్చిన లిఖితపూర్వకమైన సమాధానంవల్ల వెల్లడి అవుతున్నది ఈ ఉల్లంఘనలను గూర్చి ఐరాస సైనిక పరిశీలకులకు భారత ప్రభుత్వం ఫిర్యాదు చేసినది.

700916

విశాలాంధ్ర

సంపుటి 11] విజయవాడ * 1 సెప్టెంబరు 1961 శుక్రవారం * [సంచిక 248

'విశాలాంధ్ర' పత్రిక
చందా వివరాలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	28 00	30 00
ఆరు మాసాలు	14 00	15 00
మూడు మాసాలు	7 00	7 75
ఒక మాసం	2 40	2 60

అణ్వస్త్రపరీక్షలను తిరిగి ప్రారంభించేందుకు రష్యా నిర్ణయం

అమెరికా, బ్రిటన్ మొదలైన దేశాల వైఖరివల్ల ఇది తప్పనిసరి అయిందని ప్రకటన

సమగ్ర నిరాయుధీకరణకూ, అణ్వస్త్ర నిషేధానికీ సర్వదా సిద్ధమని పునరుద్ఘాటన

మాస్కో, ఆగస్టు 31

అణ్వస్త్రపరీక్షలను తిరిగి ప్రారంభించడానికి నిశ్చయించుకున్నామని సోవియట్ ప్రభుత్వం నేడొక ప్రకటన చేసింది "అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, పశ్చిమజర్మనీలూ, వాటి నాయకత్వాన ఉన్న అట్లాంటిక్ సైనిక కూటమీ, అనుసరిస్తూన్న విధానాలు, ఈనిర్ణయం తీసుకోవడంతప్ప సోవియట్‌కు మరోమార్గం లేకుండా చేస్తున్నాయ"ని ఈ ప్రకటన తెలిపింది

తనంతట తానుగా సోవియట్ ప్రభుత్వం 1958 నవంబరులో అణ్వస్త్ర పరీక్షలను నిలిపివేసింది ఆ తరువాత కొంతకాలానికి, ప్రపంచ ప్రజాభిప్రాయం ఒత్తిడి ఫలితంగా అమెరికా, బ్రిటన్లుకూడా అణ్వస్త్ర పరీక్షలను నిలిపివేస్తూ నిర్ణయాలు చేశాయి

కాని, అణ్వస్త్ర పరీక్షల నిలుపుదల విషయమై జెనీవాలో సోవియట్, అమెరికా, బ్రిటన్‌లమధ్య సాగుతూన్న సంప్రతింపులలో, ఒక ఒప్పందం కుదరకుండా అమెరికా, కొన్ని సంవత్సరాలుగా అడ్డుతగులుతూ ఉంది అమెరికా మొండి వైఖరి ఫలితంగా గత అయిదుమాసాలనుండి ఆ సంప్రతింపులలో ప్రతిష్టంభన ఏర్పడింది. పైగా ఒడంబడిక కుదరకుండా రష్యాయే అడ్డుపడుతూందని అమెరికా, బ్రిటన్లు ఆరోపిస్తున్నాయి

గత్యంతరం లేక జరిగిన నిర్ణయం

ఈ పరిస్థితులలో అణ్వస్త్ర పరీక్షలను తిరిగి ప్రారంభించటం తప్పనిసరి అయిందంటూ సోవియట్ చేసిన ప్రకటనలో ఇంకా యిలా ఉంది

ఎంతో అయిష్టతతోనూ, ఎంతో విచారంతోనూ, సోవియట్ ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది సమస్యలను చాల జాగ్రత్తగా పరిశీలించినమీదటనే ఇలా నిర్ణయించింది అంతర్జాతీయపరిస్థితులే ఇందుకు కారణం

అణు, హైడ్రోజన్ ఆయుధాల పరీక్షలవల్ల, ప్రాణికోటికి కలిగే కీడు సోవియట్ వారికి బాగా తెలుసు అందువల్ల, ఈ ప్రమాదకర ఫలితాలను చాలవరకు తగ్గించేందుకు అవసరమైన చర్యలన్నిటినీ సోవియట్ ప్రభుత్వం తీసుకొంటోంది.

అట్లాంటిక్ కూటమి ప్రధాన దేశాలయిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ ప్రభుత్వాలూ, మొత్తం అట్లాంటిక్ సైనిక కూటమీ అనుసరిస్తూన్న విధానాలవల్ల సోవియట్ ప్రభుత్వం ఇలా నిర్ణయించడం తప్పనిసరి అయింది. మరొక మార్గం లేదు.

అట్లాంటిక్ కూటమిలోని కొన్ని దేశాల రాజధానీ నగరాల్లోని దుందుడుకుగాళ్ల ఉబలాటాన్ని చల్లార్చగల అత్యంత సమర్థవంతమయిన ఆయుధాలను సోవియట్ మెరుగుపరచుకోవడం చాల అవసరం అందుకుగల అవకాశాలన్నింటినీ ఉపయోగించుకొనక పోతే, శాంతియుతజీవితంకోసం కృషి చేస్తూన్న ప్రజలపట్ల సోవియట్ తన పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తించజాలదు

భూగర్భ అణ్వస్త్ర పరీక్షలను అమెరికా, ప్రారంభించబోతూందనేది బహిరంగ రహస్యం

అమెరికా, బ్రిటన్ల ప్రోత్సాహంతో ఫ్రాన్సు చాలకాలంగా అణ్వస్త్ర పరీక్షలను సాగిస్తూనేఉంది వీటినిఆపివేయక పోతే, తానుకూడా అణ్వస్త్ర పరీక్షలను ప్రారంభించవలసి వస్తుందని సోవియట్ హెచ్చరించినా లెక్కచేయకుండా ఆ పరీక్షలను సాగిస్తూంది.

ఎవ్వరినీ బెదిరించాలనేఉద్దేశంగాని, ఎవరిపైనా దాడిచేయాలనే ఉద్దేశంగాని, సోవియట్ ప్రభుత్వానికిలేదు మొదట దెబ్బతీసేవి సోవియట్ సాయుధబలాలు యెన్నడూకావు

ఈ ప్రకటన పాఠాన్ని "టాస్" వార్తాసంస్థ ప్రకటించింది

రష్యా జరుపగల అణ్వస్త్ర పరీక్షలు

రెండు, మూడు, అయిదు, పదికోట్ల టన్నుల టి. ఎన్ టి ప్రేలుడు పదార్థంతో సమానమయిన ప్రేలుడు శక్తిగల అణుబాంబులను తయారు చేయడానికి సోవియట్ ఒక పథకాన్ని సిద్ధంచేసిందని ఈ ప్రకటన తెలిపింది

"గగారిన్, టిటోవ్ రోదసీయానాల్లో ఉపయోగించిన రాకెట్లలాంటివి, ఈ అణుబాంబులను ప్రపంచంలో ఏ ప్రాంతానికయినాసరే, ప్రేల్చగలవన్నది సోవియటుపైనగాని, ఇతర సోషలిస్టు దేశాలపైనగాని దురాక్రమణ యుద్ధాలకు వేదికలు ప్రపంచంలో ఏ మూలనున్నా సరే, అక్కడికి ఈ బాంబులు చేరగలవన్నది.

ప్రపంచ ప్రజలకు విజ్ఞప్తి

ప్రస్తుతం ఇటువంటి నిర్ణయం చేయవలసివచ్చినా, సమగ్ర సంపూర్ణ నిరాయుధీకరణ ఒడంబడికపై సంతకం చేయడానికీ, అణ్వస్త్ర పరీక్షలను పూర్తిగా మానివేయడానికీ, సోవియట్ సర్వదా సంసిద్ధంగానే వున్నదని ఈ ప్రకటనలో సోవియట్

(మిగతా 6వ పేజీ 6వ కాలంలో)

రామేశ్వరానంద్ నిరాహారదీక్ష విరమణ

న్యూఢిల్లీ, ఆగస్టు 31

హిందీ రక్షాసమితి అధ్యక్షుడు శ్రీ రామేశ్వరానంద్ నేటి ఉదయం తన నిరాహారదీక్ష విరమించారు పంజాబీ సుబాకోసం మాస్టర్ తారాసింగ్ ప్రారంభించిన నిరాహారదీక్షకు ప్రతికూలంగా శ్రీ రామేశ్వరానంద్ తన నిరాహారదీక్షను ఈ నెల 16వ తేదీన ప్రారంభించారు నిరాహారదీక్ష విరమించవలసిందిగా ప్రధాని నెహ్రూ వ్రాసిన లేఖను సమితి కార్యదర్శి శ్రీ వీరేంద్ర చదివారు అకాలీ కోర్కెపట్ల ప్రభుత్వం అవలంబించిన ఖచ్చితమైన వైఖరి దృష్ట్యా దీక్ష విరమించవలసిందిగా శ్రీ నెహ్రూ ఇందులో కోరారు రెండే రెండు వాక్యాలుగల ఈ ఉత్తరాన్ని శ్రీ నెహ్రూ హిందీలో స్వయంగా వ్రాశారు.

శ్రీ రామేశ్వరానంద్ పళ్ళరసం, తేనె పుచ్చుకొని నిరాహారదీక్ష విరమించారు. శ్రీ తారాసింగ్ కూడా తన దీక్షను విరమించవలసిందిగా శ్రీ రామేశ్వరానంద్ విజ్ఞప్తి చేశారు పంజాబును మరింక విడదీయరాదని ఖచ్చితమైన వైఖరిని అవలంబించినందుకు ప్రధాని నెహ్రూను రామేశ్వరానంద్ అభినందించారు. తన ప్రాణం పోయినాసరే ప్రభుత్వాన్ని బెదిరించటమే ఉద్దేశంగా మాస్టర్ తారాసింగ్ పెట్టుకొంటే, భారతదేశ ఐక్యతకోసం నా ప్రాణాన్ని కూడా ఒడ్డుతానని ఆయన అన్నారు సిక్కులకు బాధకలిగించే పనులేవీ చేయవద్దని ఆయన హిందువులకు విజ్ఞప్తి చేశారు.

హిందువులు ఐక్యంగా కలిసిమెలిసి ఉండేరోజు ఎంతో దూరంలో లేదన్నారు.

ఆగస్టు 28న బర్మాప్రధాని యూనూ న్యూఢిల్లీకి వచ్చినప్పుడు ప్రధాని నెహ్రూ స్వాగతమిస్తున్న దృశ్యం

సామ్రాజ్యవాదులు తలపెట్టిన విద్రోహాన్ని బ్రెజిల్ త్రిప్పికొడ్తుంది

క్వాడ్రోస్ రాజీనామాపై క్యూబా ప్రధాని డాక్టర్ కాస్ట్రో విశ్వాసం

హవానా, ఆగస్టు 30

బ్రెజిల్ అధ్యక్షుడు జానియోక్వాడ్రోస్, అమెరికా సామ్రాజ్యవాద శక్తులు దేశంలోని అభివృద్ధి నిరోధకవర్గాల వత్తిడిమూలంగా బలవంతాన రాజీనామా చేసినందుకు క్యూబా రిపబ్లికన్ ప్రధాని డాక్టర్ కాస్ట్రో ఆందోళన వెలిబుచ్చారు అమెరికా సామ్రాజ్యవాదులు తలపెట్టిన విద్రోహాన్ని బ్రెజిల్ ప్రజలు త్రిప్పి కొడతారన్నారు

క్వాడ్రోస్ పదవినుండి వైదొలగడంతో దక్షిణఅమెరికా, ప్రజలస్వయం నిర్ణయాధికార సూత్రాన్ని బలపర్చే ప్రముఖులలో ఒక ముఖ్యుణ్ణి నష్టపోతుందని వ్యాఖ్యానించారు క్వాడ్రోస్ రాజీనామా యిచ్చినందుకు, అమెరికా అభివృద్ధి నిరోధకశక్తులు విదేశాంగశాఖ, సామ్రాజ్యవాద గుత్తవర్గాలూ, ప్రజల జాతీయ స్వాతంత్ర్య సార్వభౌమాధికారాలకు శత్రువులైనవారు మాత్రమే సంతసిస్తారని డాక్టరు కాస్ట్రో అన్నారు

కాస్ట్రో యింకా యిలా అన్నారు

"క్వాడ్రోస్ రాజీనామాతో, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, శాంతి విధానాన్ని, సకల ప్రజలతో వర్తక, స్నేహ సహకారాల సంధానాన్ని చేపట్టిన ప్రముఖ నాయకుణ్ణి అమెరికా నేడు కోల్పోతుంది ఇది విచారకరం. ఇందుకు క్యూబా ప్రజ లెంతో విచారిస్తున్నారు

"ఐరాసలో బ్రెజిల్ నిక్కచ్చిగా వ్యవహరించింది ఇటీవల ఉరుగ్వేలో జరిగిన దక్షిణ అమెరికా దేశాల ఆర్థికసభలో కూడా అమెరికా కుట్రలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడింది అమెరికా జోక్యందారీ విధానాలకు వ్యతిరేకంగా క్వాడ్రోస్ నిలబడ్డారు క్యూబాకు అండగా నిలిచారు బ్రెజిల్ ప్రజల నేటి చిక్కు సమయంలో క్వాడ్రోస్‌కూ, బ్రెజిల్ ప్రజలకూ తన సంఘీభావాన్ని క్యూబా అందజేస్తోంది సామ్రాజ్యవాదం తలపెట్టిన విద్రోహాన్ని బ్రెజిల్ మహాప్రజలూ, కార్మికులూ, రైతులూ, విద్యార్థులూ, నిజాయితీగల ఉద్యోగవర్గాలూ త్రిప్పికొట్టి, తిరిగి విజయం సాధించగలరనే క్యూబా విశ్వసిస్తోంది."

డాక్టర్ కాస్ట్రో

లోక్ సభ నాయకుడుగా శ్రీ మొరార్జీదేశాయి

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ప్రధాని నెహ్రూ బెల్‌గ్రేడ్‌కు వెళ్ళినందున ఆయన స్థానంలో ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీ దేశాయి లోక్‌సభ నాయకుడుగా వ్యవహరిస్తారని అధికారయుతంగా ప్రకటించారు.

యూరప్‌లోకల్లా పెద్ద కోక్ కర్మాగారం

స్టాలినో, ఆగస్టు 30

యూరప్‌లోకల్లా పెద్దదైన కోక్ రసాయనిక కర్మాగారాన్ని డోనెట్స్‌నదీలోయ(రష్యా)ప్రాంతంలోని స్టాలినో పట్టణం సమీపంలో నిర్మిస్తున్నారు ప్రపంచంలోకల్లా అత్యంత శక్తివంతమైన ఎనిమిది జతల కోక్ ఓవెన్లను ఇక్కడ నిర్మిస్తున్నారు.

‘పంజాబు రాష్ట్రానికి కూడా భాషారాష్ట్ర నిర్మాణసూత్రాన్ని అన్వయించండి’

అదొక్కటే నేడు పరిష్కారమార్గమని శ్రీ నంబూద్రిపాద్ హెచ్చరిక

తిరువనంతపురం, ఆగస్టు 31

"భాషారాష్ట్ర నిర్మాణసూత్రం అన్వయించడంలో పంజాబు ఒక మినహాయింపుకాదు"అని బాహటంగా ప్రకటించడం ఒక్కటే పంజాబీసుబా సమస్య పరిష్కారానికి ఏకైకమార్గమని కమ్యూనిస్టు నాయకుడు శ్రీ నంబూద్రిపాద్ నేడిక్కడ అన్నారు

శ్రీ నంబూద్రిపాద్ పత్రికా విలేకరులగోష్ఠిలో మాట్లాడుతూ, హిందువులకు అనుకూలంగా ఉంటుందా? సిక్కులకు అనుకూలంగా ఉంటుందా? అని చూడకుండా భాషారాష్ట్ర నిర్మాణ సూత్రాన్ని పంజాబునకుకూడా అన్వయించాలనీ, కాని ప్రభుత్వం ఆ విధంగా చేసినట్టు కనపడదు సరికదా ప్రభుత్వం హిందువులుచేసే ఆందోళనకు లొంగుతూందనీ అన్నారు.

శ్రీ నెహ్రూ ప్రసంగంపై అకాలీదళ కార్యవర్గ నిరసన

అమృతసర్, ఆగస్టు 30

పంజాబీ సుబాకోర్కెనునిరాకరిస్తూ పార్లమెంటులో శ్రీ నెహ్రూ చేసిన ప్రసంగాలను నిశితంగా ఖండిస్తూ అకాలీదళ కార్యవర్గం ఒక ప్రకటన చేసింది. శ్రీ నెహ్రూ "పచ్చిమత, మతతత్వవాది అనీ, సంకుచిత ధోరణి కలవాడనీ" ఇందులో విమర్శించారు శ్రీ నెహ్రూ ప్రసంగంలోని కొన్ని భాగాల గురించి చెబుతూ "అకాలీలు తమ గురువుల పవిత్రభూమికి - తమ మాతృభూమికి -చెందిన వారనీ, నిందారోపణలు చేస్తూ శ్రీ నెహ్రూ చేసిన ప్రసంగాలు సిక్కుల మనసులను గాయపరచడానికే ఉపకరిస్తాయనీ అన్నారు. ప్రజాస్వామిక పద్ధతులు ప్రభుత్వాన్ని కదిలించలేకపోతే ఈ ప్రజాస్వామిక సాంఘిక బృందం (అకాలీ దళం) తన ప్రియతమ నాయకుని కోసం తన ప్రాణాలను కూడా అర్పించడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రకటనలో ఇంకా ఇలా ఉంది

"జవహర్‌లాల్ నెహ్రూ అంతటి స్థాయిగల మనిషి, కుల, మత తత్వాల స్థాయిలోకి, సంకుచిత ధోరణికి దిగజారడం చాలా శోచనీయం పంజాబీసుబా కావాలని కోరిన అపరాధానికి సిక్కులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేపనికి శ్రీ నెహ్రూ తయారయారు మతరహిత రాజ్యాంగ సూత్రాలను శ్రీ నెహ్రూ ఇందుకు బలిపెట్టారు. పంచశీల వీరుడుగా ప్రఖ్యాతి పొందినవీరు, ప్రపంచంలో ఎక్కడ ఏమూల వివాదం వచ్చినా పరిష్కరించడానికి ముందు నిలబడే వీరు, తమదేశం విషయం వచ్చేసరికి ప్రజాస్వామిక విధానాలను గాలికివదలి సామ్రాజ్య అధిపతి ధోరణిలో మాట్లాడుతున్నారు సర్వాధికారాలుగల ప్రభుత్వ యంత్రాన్ని చేతిలో పెట్టుకొని మతోన్మాద పెనుభూతాన్ని లేవదీసి పంజాబీ భాషమాట్లాడే వారిని అవమానించడానికి, నిర్మూలించడానికి, విచ్ఛిన్నం చేయడానికి శ్రీ నెహ్రూ సమకట్టారు."

ప్రభుత్వ పరిశ్రమల తనిఖీకి కమిటీ

పార్లమెంటు ఉభయసభల ప్రతినిధులతో ఏర్పరచాలని ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలు ఎలా పని చేస్తున్నాయో తనిఖీ చేసేందుకై పార్లమెంటు ఉభయ సభలకు చెందిన సభ్యులతో ఒక కమిటీని నియమించాలని కేంద్ర ప్రభుత్వం నేడు నిర్ణయించింది

కమిటీ నియామకాన్ని లోక్‌సభ స్పీకరు, రాజ్యసభఅధ్యక్షుడు, ఉభయ సభలు ఆమోదించవలసి వుంటుంది

ఇంచుమించు బ్రిటన్‌లోని నియమింపబడిన కమిటీలాగానే ఇదికూడ పనిచేస్తుంది.

మంగళ డామును నిర్మించాలన్న ప్రతిపాదనకు మూడుసార్లు ఆక్షేపణ తెలిపామని లోక్‌సభలో విదేశాంగ శాఖ మంత్రి పార్లమెంటరీ కార్యదర్శి తెలిపారు.

హైదరాబాదుకు మంగోలియా రాయబారి రాక సెప్టెంబర్ 1న

హైదరాబాద్, ఆగస్టు 30

భారతదేశంలోని మంగోలియా రాయబారి దూగెర్ సూరెన్ సెప్టెంబరు 1వ తేదీన ఇక్కడికి వస్తారు నగరంలో రెండు రోజులపాటు ఉంటారు

ఆసియా-ఆఫ్రికా సంఘీభావ సమితి హైదరాబాద్ శాఖ వారికి, కింగ్ కోఠీలోని వై డబ్ల్యు సి. ఎ హాల్‌లో సాయంత్రం ఆరు గంటలకు స్వాగతం చెబుతుంది

సెప్టెంబరు ఆఖరువారంలో మంగోలియా జీవితాన్ని చిత్రించే ఫోటో ప్రదర్శనం జరుగుతుంది (వి వి)

తారాసింగ్ ప్రభృతుల అరెస్టు సమస్య

ఎవరినీ అరెస్టుచేయడానికి పోలీసులు దేవాలయాల్లోకి వెళ్ళరని శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ఏ వ్యక్తినైనా అరెస్టు చేసేందుకు పోలీసులు దేవాలయాలలోనికి ప్రవేశించరాదని నిషేధించే శాసనమేదీ లేకపోయినా, సాధారణంగా అందుకై వారు దేవాలయం ప్రాంగణంలోనికి అడుగు పెట్టరని కేంద్ర హోంమంత్రి శ్రీలాల్‌బహద్దూర్‌శాస్త్రి నేడు లోక్‌సభలో చెప్పారు

మాస్టర్ తారాసింగ్, యోగిరాజ్ సూర్యదేవ్ గార్లపై జారీ అయిన అరెస్టు వారంట్లను గురించి మహావీర్ త్యాగి పంపించిన ప్రతిపాదనకు సమాధానంగా శ్రీ లాల్‌బహద్దూర్‌శాస్త్రి నేడొక ప్రకటనచేస్తూ ఇంకా ఇలా అన్నారు

"దేవాలయాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం వాంఛనీయం కాదని మా అభిప్రాయం వాటి పవిత్రతను కాపాడటం చాలాముఖ్యం. ఈ విధంగా వాటిని ఉపయోగించే పద్ధతి సరికాదు. దీన్ని గురించి మనం కొంత ఆలోచించవలసివుంది. ప్రస్తుత పరిస్థితిలో ఏమిచేయాలో నిర్ణయించవలసింది పంజాబు ప్రభుత్వమే వారి కిష్టమయినట్లు వారు నడుచుకోవచ్చు

భారత శిక్షాస్మృతిక్రింద, క్రిమినల్ ప్రొసీజరుకోడు క్రింద మాస్టర్ తారాసింగ్, సంత్ ఫతేసింగ్, యోగిరాజ్ సూర్యదేవ్ లపైఅరెస్టువారంట్లు జారీఅయినమాటనిజమే ఆగస్టు8నుండి అమృతసర్‌లో పంజాబీసుబాపై ఉపన్యసించడం, కరపత్రాలు ప్రకటించడం, లేక ప్రచారం చేయడంలాంటి పనులను నిషేధిస్తూ పంజాబ్ ప్రభుత్వం 144 సెక్షన్ విధించింది సంత్ ఫతేసింగ్ మాస్టర్ తారాసింగ్ ఈ ఉత్తర్వును ఉల్లంఘించారు. దానిపై స్థానిక మేజిస్ట్రేటు భారత శిక్షాస్మృతి 188 సెక్షన్‌క్రింద అరెస్టు వారంట్లు జారీ చేశారు.

తనపై అరెస్టు వారంటు వున్న వ్యక్తులు ఏగురుద్వారాల్లోనో లేక ఇతర పవిత్రాలయాల్లోనో తలదాచుకోవటం పంజాబులో పరిపాటి. ప్రస్తుత సందర్భంలో ముద్దాయిలను ప్రభుత్వానికి అప్పగించడంలో తోడ్పడవలసిందిగా మేజిస్ట్రేటు సిక్కు ప్రబంధక్ కమిటీ అధ్యక్షునికి నోటీసు ఇచ్చారు. వారు సహాయపడతారని ప్రభుత్వం సహజంగా భావిస్తోంది

యోగిరాజ్ సూర్యదేవ్ పైకూడ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 107, 151 సెక్షన్ల క్రింద అరెస్టు వారంటు జారీచేశారు."

పై ప్రకటనపైన సభ్యులు కొన్ని ప్రశ్నలు అడగడానికి ప్రయత్నించారు. కాని స్పీకర్ ఎజెండాలోని తరువాత చర్చనీయాంశం ఎత్తుకున్నారు.

కృష్ణమీనన్‌కు కృపలానీ పోటీ?

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ఆచార్య కృపలానీ వచ్చే ఎన్నికలల్లో ఉత్తర బొంబాయి నియోజక వర్గంనుండిపోటీ చేయడానికి నిర్ణయించారని ఆయనకు సన్నిహితమయిన వర్గాలు నేడు తెలియజేశాయి. ఈ నియోజక వర్గంనుండి భారత రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ పోటీ చేయనున్నారు.

పత్రికలవారు ఈ విషయం శ్రీ కృపలానీని అడగగా "తాను చెప్పేదేమీ లేదు"ని అన్నారు

అయితే తాను ఒక నియోజక వర్గం నుండి మాత్రమే పోటీచేస్తానని, రెండు నియోజక వర్గాలనుండి పోటీ చేయనున్నాననే వార్త నిజం కాదనీ అన్నారు.

శ్రీ కృపలానీ గత ఎన్నికల్లో బీహారులోని సీతామర్హి నియోజక వర్గం నుండి ఎన్నికయినారు.

పశ్చిమ రాజ్యాల విదేశాంగ మంత్రుల సమావేశం

సెప్టెంబరు 14న జరుగుతుందని కెన్నెడీ ప్రకటన

వాషింగ్టన్, ఆగస్టు 30

జర్మనీ, బెర్లిన్ సమస్యలను గురించి చర్చించేందుకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ పశ్చిమజర్మనీ విదేశాంగ మంత్రులు వాషింగ్టన్‌లో సెప్టెంబరు 14వ తేదీన సమావేశమవుతారని అమెరికా అధ్యక్షుడు కెన్నెడీ నేడు తన పత్రికా గోష్ఠిలో తెలిపారు.

సోవియటుతో ఈ ఏడాది లోనే సంప్రతింపులు జరుగగలవనీ, ఆ సంప్రతింపులలో పశ్చిమ దేశాలు అనుసరించగల ఉమ్మడి వైఖరి ఈ విదేశాంగమంత్రుల చర్చలలో రూపొందగలదనీ, వాషింగ్టన్‌లోని రాజకీయ వర్గాలవారు భావిస్తున్నారు.

తన ప్రత్యేక ప్రతినిధిగా జనరల్ లూషియస్ క్లే పశ్చిమ బెర్లిన్ వెళ్తారనీ, అక్కడ "ప్రత్యేక ఏర్పాట్లు అవసరమయినంతకాలమూ" రాయబారి హోదాలో ఆయన ఉంటారనీ కూడా కెన్నెడీ నేటి పత్రికాగోష్ఠిలో తెలిపారు.

బెర్లిన్ పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందన్నారు ఆ సమస్యను బలప్రయోగంతో పరిష్కరించ బూనుకుంటే అందరికీ అనర్థం తప్పదనీ, అలా జరక్కుండా చూడాలని క్రుశ్చేవ్‌కి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు

1949 లో పశ్చిమ బెర్లిన్‌కుపోయేదారులను సోవియట్ మూసివేసినప్పుడు పశ్చిమ బెర్లిన్‌కి కావలసిన సప్లయిలన్నిటినీ విమానాలద్వారా అందజేసే కార్యక్రమానికి నాయకత్వం వహించినది ఈ జనరల్ లూషియస్ క్లేయే.

సెప్టెంబరు 14 వాషింగ్టన్‌లో

(మిగతా 6వ పేజీ 8వ కాలంలో)

అమెరికాకు ఆంధ్రనుండి పంచదార ఎగుమతి

విశాఖపట్నం, ఆగస్టు 30

ఆంధ్రలోని 11 పంచదార మిల్లుల నుండి పోగుచేసిన 10 వేల టన్నుల పంచదారలో మొదటిదఫా మూడువేల టన్నులు నేడు అమెరికాకు ఇక్కడ నుండి ఎగుమతి అయింది రెండవదఫా మూడువేలటన్నులు సెప్టెంబరు 2వ తేదీన ఎగుమతి అవుతుంది

విశాఖరేవునుండి పంచదార ఎగుమతి కావడం ఇదే మొదటిసారి అని రేవు నిర్వాహణాధికారి శ్రీ వి ఆర్ రెడ్డి అన్నారు

విప్లవనామ సంవత్సర
శ్రావణ బ॥ సప్తమి సా 4-28 కృత్తిక సాయంత్రం 5-31

విశాలాంధ్ర

శుక్రవారం 1—9—1969

విన్నపం

ఈ వారం 'విశాలాంధ్ర' వారోత్సవం జరుగనున్నది అందుకు కమ్యూనిస్టుపార్టీ పిలుపిచ్చింది కమ్యూనిస్టు కార్యకర్తలు యీ దినపత్రికకు చందాదారులను చేర్పించేందుకూ, విరాళాలు వసూలు చేసేందుకూ పూనుకున్నారు వారితోపాటు యీ కార్యక్రమంలో పాల్గొనమనీ, పూర్తిసహకారం, ఆదరణ, అండా చూపమనీ శ్రేయోభిలాషులకూ, చదువరులకూ విజ్ఞప్తి చేస్తున్నాం

తొమ్మిది సంవత్సరాలుగా యీ దినపత్రిక తెలుగుప్రజల ఆదరణ పొందింది శ్రామికప్రజలు దాన్ని పెంచిపోషించారు విజ్ఞులు దాన్ని గుర్తించి ఆదరించారు ప్రజాస్వామ్యం వర్ధిల్లేందుకు ప్రతిపక్ష పత్రికగా 'విశాలాంధ్ర' ఎంత అవసరమో రాజకీయవేత్తలు గ్రహించారు; దాన్ని హర్షించారు

కష్టజీవులకు తలలో నాలికగా తన జీవితమంతా నిలిచింది 'విశాలాంధ్ర' అన్యాయాన్నీ, అక్రమాన్నీ, అవినీతినీ, మూఢనమ్మకాన్నీ—అవి రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో ఎక్కడ ప్రదర్శితమైనా - సునిశితంగా ఖండించింది

తెలుగుప్రజలు ఆందోళన చెందిన జాతీయ సమస్యలన్నిటా 'విశాలాంధ్ర' మొదటిశ్రేణిని నిలిచి సేవచేసింది ఆంధ్ర, విశాలాంధ్ర నిర్మాణమూ, నందికొండ ప్రాజెక్టు గుర్తింపు విషయాల్లో ప్రజాభిప్రాయానికి వాణిగా 'విశాలాంధ్ర' వ్యవహరించింది తెలుగుదేశంలో ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమలస్థాపన జరగాలని నిరంతరం 'విశాలాంధ్ర' పోరాడింది

పీడిత ప్రజల పోరాటాలన్నిటి సందర్భంలోనూ – అది కార్మికుల పనినిలుపుదల కానీయండి, కౌలుదారుల పోరాటం గానీయండి, ఉపాధ్యాయుల నిరాహారదీక్షా ఉద్యమం కానీయండి, యన్ జి ఓల మూకుమ్మడి సెలవు కార్యక్రమం కానీయండి, కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె కానీయండి – 'విశాలాంధ్ర' వారి న్యాయమైన హక్కులను గొంతెత్తి చాటింది విద్యార్థుల యిబ్బందులను తెలియజెప్పింది

జాతీయ పునర్నిర్మాణావకాశాలను వేనోళ్లవినిపించింది ప్రభుత్వరంగ విస్తరణ భూసంస్కరణలూ ఎంత అవసరమో నచ్చజెప్పేందుకు కృషిచేసింది ప్రణాళిక ఆశయాలకు ప్రభుత్వ మనుసరిస్తున్న పద్ధతులకూ మధ్యగల అఖాతాన్ని అధిగమించేందుకు తీవ్ర విమర్శన చేసింది అధికధరలు, అదనపు పన్నులు, అంతులేని లాభాలు, సామ్రాజ్యవాదుల అప్పులూ మన ప్రజలనూ, ప్రణాళిక ఆశయాలనూ ఎలా దెబ్బతీస్తున్నాయో నిరంతరం నిదర్శనలు జూపి 'విశాలాంధ్ర' ఖండించింది

ప్రాంతీయతత్వాలకూ, కులమత వివక్షలకూ, సంకుచిత భావాలకూ బద్ధవ్యతిరేకి 'విశాలాంధ్ర' లౌకిక భావాల సంరక్షణావసరాన్ని అభ్యుదయభావాల సమన్వయాన్ని అనవరతం ప్రబోధించింది

కొద్దిమంది చేతుల్లో సంపదలు గుట్టలుపడటం, ఒకే పార్టీ అధికారాన్నంతటినీ గుత్తకు పుచ్చుకోవడం అనేక అనర్థాలకు ఎలా దారితీస్తున్నదో ప్రజలదృష్టికి 'విశాలాంధ్ర' తెచ్చింది కాంగ్రెసుపార్టీ నాయకత్వం సర్వాధికారిగా రాజ్యాంగచట్టానికి అవకాశవాద వ్యాఖ్యానాలు చేసి అధికారాన్ని ఎలా హస్తగతం చేసుకుంటున్నదీ, కేరళలో కష్టజీవుల ప్రభుత్వాన్నెలా కూలదోసిందీ వెల్లడిచేసింది ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు శాయశక్తులా పాటుబడ్డది.

'విశాలాంధ్ర' యుద్ధానికి వ్యతిరేకం దానిది శాంతిదీక్ష వలస రాజ్యాధిపత్యానికి అది ప్రతికూలం దానిది స్వాతంత్ర్యకాంక్ష మనిషిని మనిషి దోచుకునే విధానం ఎంత త్వరగా అంతరిస్తే అంత మంచిదన్నది దాని లక్ష్యం అందుకే యుద్ధకూటాలనూ, సామ్రాజ్యవాదులనూ నిరంతరం ఖండించింది దేశదేశాల స్వాతంత్ర్యోద్యమాల పిలుపునూ, విశ్వశాంతి సందేశాన్నీ, సోషలిస్టురాజ్యాల పురోగమనాన్నీ వినిపించింది

చర్మ గీతంగాని విమర్శనలతో, ఒకపక్షం వార్తలను - అదే పీడిత పక్షం - పూర్తిగా తొక్కిపడుతూవుండే పత్రికా ప్రపంచంలో 'విశాలాంధ్ర' ప్రవేశించింది అప్పటినుండీ దాని మనుగడ ప్రత్యక్షంగాగాని పరోక్షంగాగాని తెలుగుపత్రికా రంగంలో అనేక సత్ఫలితాలనిచ్చింది

'విశాలాంధ్ర' పత్రికా నిర్వహణలో మేముకొన్ని లోపాలు చేసి యుండవచ్చు సహృదయంతో విమర్శలువస్తే వాటిని తప్పక సరిదిద్దుకుంటాం అట్లేకొన్ని సందర్భాల్లో కొందరి మనస్సులను మేము నొప్పించి యుండవచ్చు కాని విద్యుక్త ధర్మ నిర్వహణకు మినహా మరే దురుద్దేశమూ మమ్మందుకు ప్రోత్సహించలేదని మనవి చేస్తున్నాం

మన మహాప్రజల ఆదరణతో, ఆశయాలను విడువకుండా మరింతగా వారికి సేవచేయాలన్న అభిలాషతో కొత్త యంత్రాన్నీ, కొత్త భవనాన్నీ నిర్మించసమకట్టాం నవంబరు ఒకటి, 'విశాలాంధ్ర' అవతరణ దినోత్సవంనాటికి యీ కార్యక్రమంలో ప్రథమఘట్టాన్ని పూర్తిచేసి, అక్కడినుండే మీకు పత్రిక అందించాలని తలపెట్టాం అది ఏ ఒక్కరి సొత్తూగాదు; కాబోదు ఏ కొద్దిమంది లాభాలకో అది రంగస్థలంకాదు; కాబోదు ఒక మహత్తర ఆశయానికి కట్టుబడిన సంస్థగా భావితరాలవారి పురోభివృద్ధికి పునాదిరాయిగా, ప్రజల సొత్తుగా అది అవతరించాలని ఆశిస్తున్నాం ఈ సమయంలో దాతలిచ్చిన ప్రతిపైసా ఆ పునాదిలో ఒకరాయిగా స్థిరస్థాపితమవుతుంది చందాదార్లుగా చేరి చదువరులు అందించిన ప్రతిమొత్తమూ ఉజ్జ్వల భవిష్యత్తుకు పెట్టుబడిగా తోడ్పడుతుంది

అందుకే విరివిగా విరాళాలిచ్చి, చందాదార్లుగా చేరి యీ వారోత్సవ కార్యక్రమానికి విజయం చేకూర్చమని వినయపూర్వకంగా విన్నవిస్తున్నాం అందరి సహాయాన్నీ సహకారాన్నీ అర్థిస్తున్నాం

బ్రెజిల్ సహజసంపదలను కొల్లగొట్టడం రుచిమరిగి అమెరికన్ సామ్రాజ్యవాదులు చేస్తున్న కుట్రలు

సైనికాధికారులను కూడగట్టుకొనితద్వారా నియంతృత్వం స్థాపించాలని ప్రయత్నం

బ్రెజిల్ వైశాల్యం 32,87,842 చదరపు మైళ్ళు

జనాభా 6 కోట్ల 40 లక్షలు.

ప్రపంచంలో పదిహేనోవంతు విస్తీర్ణం కలిగి, సువిశాల భూఖండం గల దేశాల్లో ఇది నాల్గోస్థాన మాక్రమిస్తోంది లాటిన్ అమెరికాలోని ఇతర దేశాలకన్నా ఇది పెద్దది ఇక్కడ వ్యవసాయం ప్రధాన వృత్తి కాఫీ, రబ్బరు ప్రధాన పంటలు వరి, పత్తి, పంచదార, పొగాకు, కోకోగింజలు వగైరా కూడా బాగా పండుతాయి ప్రపంచంలోకల్లా ఎక్కువ కాఫీగింజలు పండించే దేశం ఇదే బ్రెజిల్ పంచదార ఉత్పత్తిలో నాల్గోదిగానూ, పొగాకు ఉత్పత్తిలో అయిదోదిగానూ ఉంది

కాఫీ రబ్బరు, పత్తి వగైరాలను ఇతరదేశాల కెగుమతిచేసి యంత్రాలు, పారిశ్రామిక వస్తువులు, పెట్రోలు, బొగ్గు, ఎరువులు వగైరాలను దిగుమతి చేసుకుంటుంది ప్రతి సంవత్సరం ఎగుమతులకన్నా దిగుమతులే ఎక్కువగా ఉంటాయి.

ఇక్కడ ఆదిలో రెడ్ ఇండియన్ తెగలు ఉండేవి క్రీ శ 1500 సం॥లో పోర్చుగీసులు బ్రెజిల్ ని ఆక్రమించారు 1822 వరకూ ఇది బుడతకీచుల క్రింద ఉంది 1822 లో స్వతంత్ర రాజరికం ఏర్పడింది 1889లో ప్రజలు తిరగబడి రాచరికాన్ని కూలద్రోశారు

ప్రస్తుతజనాభాలో 61 శాతం శ్వేత జాతుల వారున్నారు పోర్చుగీసులు, ఇటాలియన్లు, జర్మన్లు ఇందులో ఎక్కువ మిగతా జనాభాలో 22శాతం ములాటోలు, 14 శాతం నీగ్రోలు, 2 శాతం రెడ్ఇండియన్లూ, 2 లక్షలమంది జపానీయులు వగైరా ఉన్నారు.

ఇక్కడ నూటికి 66 గురు నిరక్షరాస్యులు

అమెరికా ప్రాబల్యం

బ్రెజిల్ లో ఆదినుంచీ అమెరికా దోపిడీ అధికం ఇక్కడ ఉత్పత్తయ్యే ముడిసరుకులను చౌకగా కొనుక్కొని, వాటితో తయారైన వస్తువులను అధికధరలకు అమ్ముతూ అమెరికా విపరీతంగా దోపిడీ చేస్తూ వచ్చింది కొన్నాళ్ళు బ్రిటనుకూడా ఇందులో భాగస్వామిగా ఉన్నా, క్రమేపీ అమెరికాయే ఇక్కడి వ్యాపారాన్నంతా ఆకట్టింది.

1950 నాటికి బ్రెజిల్ లో అమెరికా పెట్టిన ప్రత్యక్ష పెట్టుబడి 64 కోట్ల 40 లక్షల డాలర్లయితే, అది 1959లో 88 కోట్ల 90 లక్షలకు పెరిగింది. నూనె, లోహం, ఇంజనీరింగు, మాంసం మున్నగు పరిశ్రమలన్నీ పూర్తిగా అమెరికన్ గుత్తవ్యాపారుల చేతుల్లోనే వున్నాయి. బ్రెజిల్ లో 18 విదేశీ కంపెనీలుంటే ఇందులో ఎనిమిది కంపెనీలు అమెరికా వారివే ఇనుము, ఉక్కు వ్యాపారంలో 85%, బొగ్గు వ్యాపారంలో 70%, ధాన్యంవ్యాపారంలో 58%, సిమెంటు వ్యాపారంలో 63 శాతం, రబ్బరు వ్యాపారంలో నూరుశాతం, మాంసం వ్యాపారంలో 80 శాతం, విద్యుచ్ఛక్తి వ్యాపారంలో 72 శాతం, మోటార్ల వ్యాపారంలో నూరుశాతం అమెరికన్ గుత్తవ్యాపారులకిందే వున్నాయి.

అమెరికా తాలూకూ ఎస్సోస్టాండర్డ్ ఆయిల్ కంపెనీ పెట్టిన పెట్టుబడిలో సగభాగం ఒక్క 1956 సం॥లోనే లాభంగావచ్చింది అలాగే 'డూపోంట్ బ్రెజిల్' కంపెనీకి 92 శాతమూ, ఫోర్డు మోటారు ఎక్స్‌పోర్టు కంపెనీకి 96 శాతమూ, 'ఫ్రీగోరిఫికో విల్సన్ దు బ్రెజిల్' కంపెనీకి 126శాతమూ, ఫార్మస్యూటికల్ మెర్క్ కంపెనీకి 286 శాతమూ, అట్లాంటిక్ ఆఫ్ బ్రెజిల్ కంపెనీకి 877 శాతమూ పెట్టిన పెట్టుబడిలో లాభంకింద వచ్చింది

బ్రెజిల్ లో పెద్ద వ్యాపార సంస్థలు 600 ఉంటే అందులో 367 అమెరికన్ వ్యాపారస్థులకు చెందినవే ఈ దోపిడీ ఫలితంగా 1958 నాటికి బ్రెజిల్ 215 కోట్ల 24 లక్షల డాలర్లు విదేశాలకు అప్పుపడింది.

అమెరికా కివ్వతేలిన అప్పు పెరుగుతున్న కొద్దీ బ్రెజిల్ కరెన్సీ విలువ తగ్గుతూ, అమెరికన్ డాలరు విలువ అధికమవుతూ వచ్చింది ఉదాహరణకు 1957 అగస్టులో 65 క్రుజైరోలు (బ్రెజిల్ నాణెం) ఒక డాలరుతో సమానమైతే 1958 మార్చికల్లా డాలరుకు 110 క్రుజైరోలు అయ్యాయి.

ఫలితంగా బ్రెజిల్ దేశం అమెరికాకు అప్పుపడి ఆ భారంతో క్రుంగిపోవలసివచ్చింది. తన దేశంలో ఎంత కరెన్సీ పెంచుకున్నా విలువలేక, నోట్ల ముద్రణానికి లోనై ఆర్థికంగా బ్రెజిల్ అణగారిపోయింది 1955 లో 6900 కోట్లుగావున్న క్రుజైరో కరెన్సీ 1960 లో 20,600 కోట్లదాకా పెరిగి, ఈ నోట్ల ముమ్మరంతో బ్రెజిల్ కార్మికుల నిజవేతనాలు పడిపోయి దుర్భర పరిస్థితు లేర్పడ్డాయి ఇదిలావుండగా విదేశాలతో చేసే వ్యాపారంలోకూడా బ్రెజిల్ చాలా నష్టపడింది నిరుడొక్క సంవత్సరంలోనే విదేశ వ్యాపారంలో 30 కోట్ల డాలర్లు నష్టపోయింది ఫలితంగా కాఫీ గింజల ధరలు పడిపోయాయి, సరుకు అమ్ముడు కాకుండా నిల్వపడింది నిరుడు వేసంగిలో 4 కోట్ల 40 లక్షల సంచుల కాఫీగింజలు అమ్ముడుకాకుండా గోడౌనులో పడివున్నాయి ఇప్పుడు ప్రపంచంలో నిల్వవున్న మొత్తం కాఫీ గింజల్లో 90 శాతం ఒక్క బ్రెజిల్ లోనే మూలుగుతున్నాయి ఈ కారణాలన్నిటికల్లా బ్రెజిల్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి లోనుకావలసి వస్తోంది

బ్రెజిల్ చాలా విశాలమైన దేశం అక్కడ సహజ సంపద అపారంగా ఉన్నది ఎంతో భూమిని సాగులోకి తీసుకురావచ్చు మున్నూట అరవై రోజులూ ప్రవహించే ఒక్క అమజాన్ -దీని గానే ఎన్నో లక్షల ఎకరాలు బీడుగా పడివుంది ఆభూములన్నీ సాగు చేయడానికి సామాన్య ప్రజలు సంసిద్ధం కాని వాటి నాకట్టిన భూస్వాములు మాత్రం అందుకు విరుద్ధం అలాగే ప్రకృతి సంపదనంతనూ వినియోగంలోకి తెచ్చుకోవాలన్న ఆకాంక్ష అక్కడి ప్రజలకు అపారం కాని అందుకు కావలసిన సాధనాలు మాత్రం కరువయ్యాయి, దీనికితోడు వాటి నాకట్టిన అమెరికా కూడా అడ్డు పడుతూ వుంది.

నూతన చైతన్యం

బ్రెజిల్ లో నూతన చైతన్యం వెల్లివిరిసింది

అమెరికాకు దాసోహమ్మంటూ దేశాన్ని అధ్వాన్న పరిస్థితుల్లో ఉంచిన శక్తులన్నింటినీ పక్కకి నెట్టి 1960 ఎన్నికల్లో బ్రెజిల్ ప్రజలు జానియో క్వాడ్రోస్ అధ్యక్షుడుగా కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు

అంతకుముందు ఎప్పుడూ అమెరికన్ సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులెత్తేవారే బ్రెజిల్లో అధికారం నిర్వ నిర్వహిస్తూ వుండేవారు.

1930 లో సైనిక కుట్ర ద్వారా అధికారంలోకి వచ్చిన వార్గాస్ చాలా ఏళ్లు బ్రెజిల్లో నియంతృత్వం చెలాయించాడు 1945 లో అతన్ని ప్రజలు కూలద్రోశారు అయినా మళ్ళీ 1950 లో అధికారంలోకి వచ్చాడు అధికారం చేబట్టాడన్నమాటేగాని దేశంలో అతనిమీదవున్న అసంతృప్తి జ్వాలలు మాత్రంచల్లారలేదు దాంతో ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు అక్కడినుంచి అభివృద్ధి నిరోధకులు ఎన్ని కుట్రలు చేస్తున్నా ప్రజాస్వామ్య శక్తుల పైచేయి సంపాదించుకొని విదేశీ సామ్రాజ్యవాదుల దోపిడీని అరికట్టడానికి, స్వతంత్ర ఆర్థిక విధానాన్ని చేబట్టడానికి, ప్రజాతంత్ర పద్ధతులను ప్రవేశపెట్టడానికి, భూ సంస్కరణలు తెచ్చి భూమిని ప్రజాయత్తం చేయడానికి, అమెరికాకు బంటుగా ఉండకుండా స్వతంత్ర విదేశాంగ విధానం అవలంబించడానికి, సోషలిస్టు దేశాల సహాయంతో జాతీయాభ్యుదయాన్ని సాధించడానికి ప్రయత్నించడం మొదలు పెట్టాయి

దీనికి కంకణం కట్టుకున్నది క్వాడ్రోస్ ప్రభుత్వం. తమలాగానే అమెరికన్ సామ్రాజ్యవాదుల దోపిడీని, వలసాధిపత్యాన్ని ఎదుర్కొని స్వతంత్రం సంపాదించుకొన్న లాటిన్ అమెరికాలోని క్యూబా మున్నగుదేశాలతోనూ, తమ స్వతంత్ర ఆర్థికాభ్యున్నతికి సహాయపడుతున్న సోషలిస్టుదేశాలతోనూ బ్రెజిల్ నేస్తం మొదలుపెట్టింది వ్యవసాయ సంస్కరణలు తలపెట్టింది ఇది అమెరికన్ సామ్రాజ్యవాదులకూ, వారి తాబేదారులైన బ్రెజిలియన్ భూస్వాములకూ-అభివృద్ధి నిరోధకులకూ కంటగింపుగా తయారైంది

ఈ శక్తులన్నీ కుట్రచేసి సైనికాధికారులను కూడగట్టుకొని బలవంతాన క్వాడ్రోస్ చే అధ్యక్షపదవికి రాజీనామా యిప్పించి ప్రభుత్వ యంత్రాంగాన్ని చేబట్టుకొన్నారు క్రమంగా ప్రజాస్వామ్యాన్ని పరిమార్చి నియంతృత్వ మేర్పర్చాలని వారి కలలు

క్వాడ్రోస్ బ్రెజిల్లో చాలా పలుకుబడి కలిగి, ప్రజల గౌరవ ప్రపత్తులను చూరగొన్న యువ నాయకుడు వీరి వయస్సు 42 సంవత్సరాలు. నిరుడు అక్టోబరులో జరిగినఎన్నికల్లోనే ఆయన అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు 'చీపురు'ను ఎన్నికలగుర్తుగా పెట్టుకొని లంచగొండితనాన్నీ, అవినీతినీ, విదేశీ దోపిడినీ ఊడ్చివేస్తానని గెలిచినఅధ్యక్షుడాయన గెలిచిన దగ్గరనుంచీ అదే విధంగా స్వతంత్ర ఆర్థిక ప్రతిపత్తినీ, జాతీయాభ్యున్నతినీ, ప్రజాతంత్ర సంస్కరణలనూ ధ్యేయంగా పెట్టుకొని కృషి చేస్తూ వచ్చాడు

అటువంటి అధ్యక్షునిచే బలవంతంగా రాజీనామా ఇప్పించి, ఆ తరువాత అధికారాన్ని చేబట్టవలసిన ఉపాధ్యక్షుడు గౌలార్టు ప్రస్తుతం విదేశాల్లో పర్యటిస్తుంటే ఆయనను స్వదేశంలోకి రాకుండా అడ్డుపడి, ప్రభుత్వ యంత్రంలో సైనికాధికారుల ప్రాబల్యాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

దీంతో బ్రెజిల్ దేశం యావత్తూ భగ్గుమంటోంది తాము నిర్మించుకున్న ప్రజాస్వామ్య విధానాలను నిలబెట్టుకోవాలనీ, అమెరికన్ సామ్రాజ్యవాదులతో మిలాఖతైన సైనికాధికారుల కుట్రలను భగ్నంచేయాలనీ దేశమంతటా ఆందోళన జరుగుతున్నది ప్రతిచోటా బ్రహ్మాండమైన సభలూ, ప్రదర్శనలూ జరుగుతున్నాయి రానున్న కొద్దిరోజుల్లోనూ పరిస్థితులు ఎలా పరిణమిస్తాయోనని ప్రపంచం యావత్తూ కుతూహలంతో ఎదురు చూస్తోంది

ఇప్పటికే లాటిన్ అమెరికాయావత్తూ అమెరికన్ సామ్రాజ్యవాదుల దాస్యత్వంతో విసిగివేసారియున్నది ఎక్కడికక్కడ విప్లవజ్వాలలు విజృంభించి అమెరికా దోపిడీని అరికట్టడానికి, స్వతంత్రంనిలబెట్టుకోడానికి ముందుకు వస్తున్నాయి.

లాటిన్ అమెరికా దేశాల్లో అమెరికా దోపిడీ మూలంగా దరిద్రం తాండవమాడి జీవితం దుర్భరమై సగటు ఆయుఃప్రమాణం 35 ఏళ్ళకు పడిపోయింది విద్యా విజ్ఞానాలు శూన్యం వైద్య సదుపాయాలు హీనం లాటిన్ అమెరికా దేశాల్లో ప్రతి లక్ష జనాభాకూ 176 మంది ఉపాధ్యాయులూ, 17 మంది డాక్టర్లు మాత్రమే వున్నారు ఆ దేశాల్లో సగటున నూటికి 70మంది నిరక్షరాస్యులు. అక్కడి జనాభా 20 కోట్లలోనూ 12 కోట్లమంది ఆకలిబాధలతో అలమటిస్తున్నారు 10 కోట్లమంది అంటువ్యాధులతో పీడింపబడుతున్నారు

ఇట్టిపరిస్థితుల్లోలాటిన్ అమెరికాలోకల్లా పెద్దదైన బ్రెజిల్ అమెరికన్ సామ్రాజ్యవాదులుగానీ, వారి తాబేదారులుగానీ అధికారంలో ఉండటాన్ని సహించడం అసంభవం.

లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు.

దేశంలో డిస్ట్రాయర్ నౌకల నిర్మాణం

ప్రభుత్వ పరిశీలనలోవుందని లోక్‌సభలో ప్రకటన

న్యూఢిల్లీ, అగస్టు 30

భారతదేశంలో డిస్ట్రాయర్లను (టార్పెడో నౌకలను ధ్వంసంజేసే యుద్ధనౌకలు) నిర్మించే విషయం ప్రభుత్వ పరిశీలనలో వున్నదనీ, కేంద్ర రక్షణ ఉపమంత్రి శ్రీ కె రఘురామయ్యా నేడు లోక్‌సభలో చెప్పారు.

అయితే ఇందుకు పథకం పూర్తి కాలేదన్నారు.

ఆవడిలో టాంకుల నిర్మాణం

టాంకుల నిర్మాణానికై మద్రాసులోని ఆవడిని ఎన్నుకోవడానికి ఒక కారణం అక్కడ వున్న రక్షణ సామగ్రిని వినియోగించే అవకాశముండడమేనని, ఇందువల్ల పెట్టుబడి వ్యయం తగ్గుతుందని రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడు లోక్‌సభలో చెప్పారు.

ఆయన చెప్పిన మిగతా కారణాలివి: ఇందుకు అనువయిన స్థలం చాలా తక్కువ ఖరీదుకు అక్కడ లభ్యం కావడం, రేవుకు ఈ స్థలం దగ్గరగా వుండటం, మద్రాసు వంటి పెద్ద పట్టణం దగ్గరగా వుండటం (టాంకు కర్మాగారంలో పనిచేసే సిబ్బంది కార్మికులు మద్రాసులో కాపురముండడానికి వీలుంటుంది కాబట్టి వీరికై ప్రత్యేకంగా కాలనీలు కట్టించే అవసరం తగ్గుతుంది)

భారత ఆకాశ సరిహద్దు ఉల్లంఘన

భారతదేశ సార్వభౌమాధికారాలను ఉల్లంఘించే బయటివారి చర్యలను అరికట్టాలనేదృఢనిశ్చయంతో భారతప్రభుత్వం వ్యవహరిస్తున్నదని రక్షణశాఖ ఉపమంత్రి శ్రీ సుర్జిత్‌సింగ్ మజిథియా నేడు లోక్ సభలో చెప్పారు

దేశ సరిహద్దుల, ఆకాశ సరిహద్దుల ఉల్లంఘనలను అరికట్టేందుకు అవసరమైన బలప్రయోగం చేయడానికికూడా ప్రభుత్వం సిద్ధంగా వున్నదని అన్నారు

శ్రీ రామకృష్ణగుప్త మొదలగువారి ప్రశ్నలకు సమాధానమిస్తూ శ్రీ మజిథియా ఇంకా ఇలా అన్నారు

"1961 జూన్ 1 నుండి పోర్చుగల్లు విమానాలు భారతదేశ ఆకాశ సరిహద్దులను ఉల్లంఘిస్తున్నాయి. అయితే వీటి సంఖ్య తగ్గుతూ వస్తున్నది. ఇటీవల ఇటువంటి సంఘటన ఒకటే జరిగింది భారతదేశంలోనికి పోర్చుగల్లు విమానం 200 గజాలు చొచ్చుకువచ్చింది కాని మన విమానాలు ఎదురు తగిలేసరికి వెనక్కు పారిపోయాయి

చైనా - భారత సరిహద్దుల్లో రోడ్లనిర్మాణం

చైనా - భారతదేశ సరిహద్దుల్లో ఇంకా ఎక్కువ రోడ్లు నిర్మించాలని ప్రభుత్వం అనుకొంటున్నదని శ్రీ కృష్ణమీనన్ ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ వెల్లడించారు అయితే వీటివివరాలను ఆయన వెల్లడించ నిరాకరించారు

టాటా కంపెనీకిచ్చిన రుణం

1959 లో టాటా కంపెనీకి ఇచ్చిన 10 కోట్ల రుణం, ఇండియన్ ఇనుము ఉక్కు కంపెనీకిచ్చిన 11 కోట్ల రుణం ఈ కంపెనీలు ఏ పద్ధతిలో తిరిగి చెల్లించాలనే సమస్యను సుంకాల కమిషన్ నివేదిక అందినవెంటనే నిర్ణయిస్తామని ఉక్కు గనుల ఇంధనాల మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ నేడు వెల్లడించారు

తాజ్‌మహల్ దర్శించాలంటే రుసుం

తాజ్ మహల్, ఫతేపూర్‌సిక్రి అక్బర్ సమాధి మొదలగు ప్రాచీన చారిత్రక నిర్మాణాలను సందర్శించాలంటే 15 సంవత్సరాలకు పైబడిన వారినుండి తలా 30 నయాపైసల చొప్పున రుసుం వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది ఇది వచ్చే ఆర్థిక సంవత్సరంనుండి అమలు జరుగుతుంది ఈ విషయం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ శాస్త్రీయ పరిశోధన సాంస్కృతిక వ్యవహారాల మంత్రి హుమాయూన్ కబీర్ వెల్లడించారు.

గుజరాత్ పాకిస్తాన్ సరిహద్దున పోలీస్‌గస్తీ

గుజరాత్ పాకిస్తాన్ సరిహద్దున పోలీసు గస్తీని తీవ్రతరం చేశామని కేంద్రదేశీయ వ్యవహారాలశాఖమంత్రి శ్రీ దాతార్ నేడులోక్‌సభలో చెప్పారు

1961 జనవరి 1 నుండి జూన్ 30వరకు 161 పాకిస్తానీయులు అక్రమంగా గుజరాత్‌లో ప్రవేశించారనీ దొంగ సరుకుల రవాణా, మతదురహంకారం రెచ్చగొట్టడం అనే నేరాలకు 12 మంది పాకిస్తానీయులను ప్రభుత్వం అరెస్టు చేసిందనీ మంత్రి వెల్లడించారు

జునాగడ్ కచ్ ప్రాంతాలలో పాకిస్తాన్ గూఢచారిచర్యలుజరిగాయా అని ప్రశ్నించగా లేదని మంత్రి సమాధానమిచ్చారు

అక్రమంగాప్రవేశించినపాకిస్తానీయులపై కేసులుపెట్టి భారత పాస్‌పోర్టు చట్టంక్రింద దేశంనుండి పంపించివేశామని చెప్పారు.

టిబెట్‌లోకి దొంగ సరకుల రవాణా జరగడం లేదు

లోక్‌సభలోమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 30

భారత దేశంనుండి టిబెట్టులోనికి పెద్ద ఎత్తున దొంగ సరకులు రవాణా అవుతున్న విషయం భారత ప్రభుత్వానికి తెలియదని రాజ్యసభలో విదేశాంగ ఉపమంత్రిణి శ్రీమతి లక్ష్మీమీనన్ నేడు శ్రీ యం యం గురుపాదస్వామి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ చెప్పారు.

శ్రీ గురుస్వామి అడిగిన ప్రశ్న ఇది "బియ్యం, చక్కెర, కిరసనాయిల్, గోధుమపిండి, సిమెంటు, పెట్రోలు మొదలగు పదార్థాలు దొంగగా టిబెట్టులోనికి దొంగగా రవాణా అవుతున్నమాట వాస్తవమేనా ?

భారత - టిబెట్టు సరిహద్దుగుండా దొంగ వ్యాపారం సాగకుండా ప్రభుత్వం తగు కట్టుదిట్టాలు చేసిందనికూడ మంత్రి తెలియజేశారు.

లాసాలో భారత దౌత్య ప్రతినిధులు

ఉపసంహరించ బోమని శ్రీ నెహ్రూ ప్రకటన

న్యూఢిల్లీ, అగస్టు 30

టిబెట్టులోని ప్రస్తుతపరిస్థితి దృష్ట్యా అక్కడ భారతదౌత్య సిబ్బందిపైవిధించబడ్డ ఆంక్షల దృష్ట్యా భారత ప్రభుత్వం లాసాలో భారత దౌత్యప్రతినిధివర్గాన్ని ఉపసంహరించుకొంటుందా అని ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు శ్రీ నెహ్రూ "ఉపసంహరించబోము" అని సమాధానమిచ్చారు.

టిబెట్టులోని భారతదేశ దౌత్యప్రతినిధులను 1954లో జరిగిన భారత-చైనా ఒడంబడిక ప్రకారం పనిచేయ్యనివ్వవలసిందిగా భారత ప్రభుత్వం చైనా ప్రభుత్వాన్ని కోరిందని ఆ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుచున్నవనీ శ్రీమతి లక్ష్మీమీనన్ చెప్పింది అయితే తక్కిన సమస్యల లాగనే ఈ సమస్యపై కూడ ఉభయులమధ్య ఏకీభావం కుదరలేదన్నారు.

విదేశాంగమంత్రుల సభ

(1 వ పేజీ 8 వ కాలం తరువాయి)

పశ్చిమ రాజ్యాల విదేశాంగ మంత్రుల సమావేశం జరుగుతుందని పారిస్‌లో కూడా అధికార ప్రకటన వెలువడింది.

కెన్నెడీకి అడినోవర్ లేఖ

పశ్చిమ జర్మనీ ప్రధాని డాక్టర్ అడినోవర్ కెన్నెడీకి, పశ్చిమ జర్మనీ రాయబారిద్వారా నేడొక లేఖను అందజేశారు

ఈ లేఖలో అడినోవర్ తెలిపిన భావాలూ, కెన్నెడీ అభిప్రాయాలూ ఒక్కటే అని తాననుకుంటున్నానని ఆ రాయబారి విల్హెల్మ్ గ్రీవ పత్రికలవారితో అన్నారు

పడమటి బెర్లిన్ హోదాను తూర్పు జర్మనీ ఇంకా భంగపరిస్తే తీసుకోవలసిన చర్యలను గురించి తాను కెన్నెడీతో మాట్లాడానికూడా ఆయన తెలిపారు

పడమటి బెర్లిన్ విషయంలో పశ్చిమ రాజ్యాలు మరింత వెనకడుగు వేస్తే పశ్చిమజర్మనీలో తటస్థభావం ఏర్పడగలదని అడినోవర్ కెన్నెడీకి రాశారని వెలువడిన వార్తలు నిజంకావని ఆయన తెలిపారు.

బెల్‌గ్రేడ్‌కి అదౌలాని పిలవరటు

బెల్‌గ్రేడ్, అగస్టు 30

కాంగో కొత్తప్రధాని అదౌలాకు ఆహ్వానం పంపకూడదని తటస్థదేశాల శిఖరాగ్ర సమావేశ సెక్రెటేరియట్ నిర్ణయించింది కాంగోలోని రాజకీయ పక్షాలమధ్య సామరస్యం కుదిరేంతవరకూ ఆయనను ఆహ్వానించరాదు

విశాలాంధ్ర దినపత్రిక

వారోత్సవం

సెప్టెంబరు 1 నుంచి 7 వరకు

ఆంధ్రజాతికి
భాషకు
దేశానికి
అనన్యమైన సేవచేసింది విశాలాంధ్ర
నిజాయితీ వార్తలకు,
నిర్భయ వ్యాఖ్యలకు,
నిష్పక్షపాత విమర్శలకు
పేరు గాంచినది విశాలాంధ్ర-
సాంఘిక న్యాయం
సమాజ వికాసం
స్వాతంత్ర్యం, సోషలిజం
శాంతి, అభ్యుదయం
వీటికై నిరంతరం పాటుపడుతోంది విశాలాంధ్ర-
ఏకైక ప్రతిపక్ష పత్రిక విశాలాంధ్ర -
శ్రామిక ప్రజల వాణి విశాలాంధ్ర -
"మరింత సొష్టవంగా
మరిన్ని శీర్షికలతో
మెక్కువ శక్తివంతంగా
విశాలాంధ్రను తీసుకురావడంకోసం
నూతన భవనాలకూ
నూతన యంత్రాలనూ
నిర్మించడానికవసరమైన
నిధి సేకరణ సందర్భంలో
విరాళాలిచ్చి తోడ్పడండి
విశాలాంధ్ర చదవండి, చదివించండి
చందాదారులుగా చేరండి, చేర్పించండి
ఇదే ఆంధ్రమహాజనులకు మా విజ్ఞప్తి

విశాలాంధ్ర లక్షనిధి

బసినేపల్లి కమ్యూనిస్టుపార్టీశాఖ, అనంతపురంజిల్లా	రూ 5
క. పా. పర్ల శాఖ కర్నూలుజిల్లా	5
క. పా. ఉప్రెమడంశాఖ ,,	5
ఆ వై స్వామిరెడ్డి, పాతకోట ,,	5
శ్రీ జె లక్ష్మిరెడ్డి ,, ,,	5
క. పా. పెండ్యాలశాఖ - ప గో జిల్లా	5
డాక్టర్ యన్ సూర్యనారాయణమూర్తి, మొగండ	5
క పా బానుముక్కలశాఖ - కర్నూలుజిల్లా	5
క పా వెలగోడుశాఖ ,,	5
క పా వెంపెంటశాఖ ,,	5
అలుకుంట పెద్దన్న - అనంతపురం	10
బిదుకల్లు రాజమ్మ ,,	5
మాకొళ్ళ వెంకటేశ్వరరావు, వెంకటరత్నమ్మగార్ల వివాహ సందర్భంలో పిఠాపురంలో వసూలు	10
క పా చినముల్లంగ్రామశాఖ	5
శ్రీ కె సత్యనారాయణ - ఉండి	రూ 2-50
శ్రీ టి నరసింహమూర్తి - ఉండి	2-50

శ్రీ వత్సవాయి సుబ్బరాజుగారి కుమార్తెలు సూర్యకుమారి, రేణుకచక్రవర్తి, వెన్నెమార్స్ తలా ఒక రూపాయి చొప్పున విరాళాలు పంపారు.

పంజాబీ సుబాసమస్య :

‘భాషారాష్ట్రసూత్రం అంగీకరిస్తూ ప్రభుత్వం ప్రకటనచేయాలి’

లోక్‌సభా చర్చలో హిరేన్ ముఖర్జీ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 30

పంజాబీసుబా విషయమై నేడు లోక్‌సభలోజరిగిన చర్చలో పార్లమెంటూ కమ్యూనిస్టుపక్ష ఉపనాయకుడు ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, పంజాబీ భాష ప్రధానభాషగావుండే భాషారాష్ట్రనిర్మాణాన్ని కమ్యూనిస్టుపార్టీ సూత్రప్రాయంగా బలపరుస్తుందని ప్రకటించారు ఈవిషయమై పార్టీ తనవైఖరిని వెంటనే ప్రధానినెహ్రూకు వ్యక్తిగతంగా తెలియజేసిందని చెప్పారు ప్రత్యేక రాష్ట్ర నిర్మాణాన్ని కమ్యూనిస్టులు సూత్రప్రాయంగా బలపరుస్తున్నారనీ, ప్రభుత్వంకూడా ఈవిషయాన్ని గుర్తిస్తూ ఒక ప్రకటన చేయాలనీ శ్రీ ముఖర్జీ కోరారు

పంజాబీ సుబా సమస్యపై అనేక ఘటనలు జరుగుతున్నాయనీ, ఈ రాజకీయ ప్రమాదాల దృష్ట్యా మరిన్ని ఉద్రేకాలు కూడా ప్రబలిపోతున్నాయనీ శ్రీ ముఖర్జీ అన్నారు. ఈ ఘటనలను, ఉద్రేకాలను సకాలంలో, సక్రమంగా పరిష్కరించకపోతే, అనూహ్యమైన ఘోర ఫలితాలకు దారితీసే ప్రమాదం వుందనికూడా శ్రీ ముఖర్జీ హెచ్చరించారు

శ్రీ ముఖర్జీ యింకా ఇలాఅన్నారు "పంజాబీభాషమాట్లాడే హిందువులు తమ భాషనే నిరాకరిస్తున్నారంటే, మాతృభాషను కాదనేవారిచర్య వెనుక ఏదోకొంత వింత మతధోరణి వుండి వుండాలి ఇట్టి పరిస్థితుల్లో మనం తమ మాతృభాషను తిరస్కరించేంత వరకూ వెళ్ళే వారి అభిప్రాయాలనుమాత్రమే తీసుకుంటామా లేక, వాస్తవానికి పంజాబీభాష మాట్లాడే ప్రజల అభిప్రాయాలను అంగీకరించడమా ?

తారాసింగ్ దీక్ష

"ఇక తారాసింగ్ నిరాహారదీక్ష విషయం పరిశీలిద్దాం నిరాహారదీక్షవల్ల బహుశా ఫలితం వుండనందున ఆ దీక్ష విరమించవలసిందిగా మేము శ్రీ తారాసింగ్‌కు విజ్ఞప్తి చేయగలం కాని ప్రధాన మంత్రి నెహ్రూ, నిరాహారదీక్షకు పూనుకోవడం తప్పనీ, సమస్యాపరిష్కారానికిది ప్రజాతంత్ర విరుద్ధమైన పద్ధతిఅనీ వాదిస్తున్నారు మీరుమాత్రం ప్రజాభిప్రాయాన్ని సమీకరించేందుకు నిరాహారదీక్షలను గతంలో ఒక రాజకీయపద్ధతిగా, సాధనగాఉపయోగించలేదాఅని ప్రధానమంత్రికి గుర్తు చేస్తున్నాను పంజాబీ భాష మాట్లాడే ప్రజలూ, పంజాబీభాషా ఎవరినీ భిక్షమడగడంలేదు. కరుణా కటాక్షాలతో వీక్షించమనివారు ప్రాధేయపడ్డంలేదు దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలకున్న హక్కునే తమకూ గుర్తించమని వారు కోరుకుంటున్నారు ఈ విషయంలో తమను వేరుగా చూడొద్దని చెప్తున్నారు వివక్షకూడదంటున్నారు. అందుకనే నేను ప్రభుత్వానికి సూచిస్తున్నాను పంజాబీసుబా డిమాండ్ విషయంలో ప్రభుత్వం భాషా రాష్ట్రాల సూత్రాన్ని అంగీకరించాలి "

త్వరలో జైప్రకాశ్ తారాసింగ్ భేటీ

ఛండీగర్, ఆగస్టు 30

నిరాహారదీక్షవహించియున్న మాస్టర్ తారాసింగ్‌ను సర్వోదయ నాయకుడు శ్రీ జైప్రకాశ్ నారాయణ సెప్టెంబరు 1 న కలుసుకుంటారని ఇక్కడి అభిజ్ఞవర్గాలు అన్నాయి

తారాసింగ్ నీరసించుతున్నట్లు ప్రకటన

అమృతసర్, ఆగస్టు 30

ఆమరణ నిరాహారదీక్ష బూనిన శ్రీ తారాసింగ్ నేడు ఊతం లేకుండా బరువు తూచే మిషన్‌పై నిలబడలేకపోయినందున ఆయన బరువెంతో తెలియలేదు ఆయన బాగా నీరసించిపోతున్నారని వైద్యులు ప్రకటించారు వేళ్ళు కొంకర్లు పోతున్నాయట.

అగస్టు 15 న సోనేపూర్‌లో జరిగిన కాల్పులపై విచారణ జరిపించడానికి నిర్ణయించినట్లు బీహారు ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించారు

యోగిరాజ సూర్యదేవ్ నిరాహారవ్రతం

న్యూఢిల్లీ, ఆగస్టు 30

అకాలీల పంజాబీసుబా కోర్కెను ప్రతికూలించడంకోసం అమృతసర్‌లో 16 రోజులుగా నిరాహారదీక్ష సాగించుతున్న యోగిరాజ సూర్యదేవ్‌ను నిరాహారదీక్ష విరమించవలసిందిగా కోరడానికిపంజాబ్ హిందీరక్ష సమితికి చెందిన నలుగురు ప్రతినిధులు అమృతసర్ వెళ్లారు

పార్లమెంటు ఎదుట అకాలీల ప్రదర్శన

న్యూఢిల్లీ, ఆగస్టు 30

పంజాబీసుబా కోర్కెను బలపరచడానికిగాను నేటి సాయంత్రం నాల్గుగంటలకు అకాలీలు పార్లమెంటు ఎదుట ప్రదర్శనం చేయనున్నారు.

స్టాన్లీవిల్లీలోని అమెరికా ప్రతినిధి బహిష్కరణ

లియోపాల్డ్‌విల్లీ, ఆగస్టు 30

స్టాన్లీవిల్లీ ప్రభుత్వాధిపతి, కాంగో ఉప ప్రధాని అయిన గిజెంగా స్టాన్లీవిల్లీలోని అమెరికా దౌత్య ప్రతినిధి కాసిలీని దేశంవిడచి వెళ్ళవలసిందిగా ఉత్తర్వు చేశారు

కాసిలీ గతరాత్రి విమానంలో స్టాన్లీవిల్లీనుంచి ఇక్కడకువచ్చారు అనుమతి లేకుండా స్టాన్లీవిల్లీలో దిగిన ఒక జోర్డాన్ విమానాన్ని కాంగోప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నప్పుడు అమెరికా దౌత్యప్రతినిధి అక్రమంగా జోక్యం కల్పించుకొన్నారు అందుకనే ప్రభుత్వం ఆయనను బహిష్కరించింది

ప బెర్లిన్ మేయర్‌కు ప్రధాని నెహ్రూ లేఖ

బెర్లిన్, ఆగస్టు 30

పశ్చిమ జర్మనీలోని భారత రాయబారి శ్రీ పి అచ్యుతమీనన్ నేడు పశ్చిమబెర్లిన్ మేయర్ విల్లీబ్రాంట్‌కు ప్రధాని నెహ్రూ వ్రాసిన వ్యక్తిగత లేఖను అందజేశారు ఈ విషయాన్ని పశ్చిమ బెర్లిన్ నగర ప్రభుత్వ ప్రధాని తెలియజేశారు లేఖాంశాలు ఏమిటో వెల్లడి కాలేదు

మదురలో జరుగనున్న ఎ ఐ సి సి సమావేశంలో కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికను ఆమోదిస్తారు

పంజాబీసుబాపై రాజీ సమస్యలేదట

……

రాజ్యసభలో ప్రధాని నెహ్రూ జవాబు

న్యూఢిల్లీ, ఆగస్టు 30

పంజాబీసుబా డిమాండ్ విషయంలో ప్రభుత్వం రాజీకివచ్చే ప్రసక్తి లేదనీ, పంజాబీసుబా నిర్మాణంవల్ల తీవ్రఫలితాలు ఏర్పడగలవనీ ప్రధాని నెహ్రూ నేడు రాజ్యసభలో పై సమస్యపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ చెప్పారు పంజాబీసుబా డిమాండ్‌ను చివరకు సూత్రప్రాయంగానైనా అంగీకరించడానికి తాము సిద్ధంగాలేమనీ, ఇది నిశ్చితాభిప్రాయమనీ ప్రధాని నెహ్రూ స్పష్టం చేశారు.

ప్రధాని నెహ్రూ యింకా యిలా అన్నారు

"పంజాబీసుబా డిమాండ్‌ను నిరాకరించడంవల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు తీవ్రమైనవే కావచ్చు కాని ఆ పరిస్థితు లెటువంటివైనా ఆ డిమాండ్‌ను అంగీకరించడంవల్ల కలిగే ఫలితాలు మరీ తీవ్రమైనవి కాగలవు. ఫలితంగా అది యావత్తు పంజాబుకూ,భారతదేశానికీ దెబ్బగా పరిణమించవచ్చు

"భవిష్యత్ ఎలా వుంటుందో నేను గ్యారంటీ ఇవ్వలేను. మన మిప్పుడు ప్రస్తుతాన్నిగూర్చి మాట్లాడుతున్నాం అందువల్ల యీ సమస్యపై ప్రభుత్వ వైఖరేమిటో స్పష్టం చేసుకోకుండా భవిష్యత్‌నుగూర్చి మాట్లాడలేం శ్రీ తారాసింగ్ నిరాహారదీక్ష విరమించవలసిందిగా మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. పార్లమెంటు ఉభయసభల్లోనూ వ్యక్తమైన యీ అభిప్రాయానికి కొంత విలువ వుంటుందనీ,దాన్ని తారాసింగ్,ఆయన అనుయాయులూ గుర్తిస్తారని ఆశిస్తున్నాను

"ఒకవేళ పంజాబీసుబా డిమాండును ఆమోదించినా దానికి ప్రతిఘటన తప్పదు (అంతర్యుద్ధం వస్తుందని నా ఉద్దేశంకాదు) ఈ ప్రతిఘటన బయటినుండిగాదు, అలా ఏర్పడే పంజాబీ రాష్ట్రంలోనే వస్తుంది పంజాబీభాష మాట్లాడే ప్రజలని చెప్పబడే ప్రాంతంలో 45 శాతం మంది భాష రీత్యాగాకుండా, అటువంటి ప్రత్యేక రాష్ట్రం అనేది మత భావమున్న దృష్ట్యానే వ్యతిరేకిస్తున్నారు అటువంటి రాష్ట్రం సంతృప్తికరంగా ఎలా పనిచేయగలుగుతుంది ?"

శ్రీ తారాసింగ్ డిమాండ్ భాషా రాష్ట్ర డిమాండ్ కాదనీ, సిక్కుమత సంరక్షణకు సంబంధించిన డిమాండ్ అనీ తనకు కొంతమంది ముఖ్యులు చెప్పినట్లు శ్రీ నెహ్రూ అన్నారు

మతదృష్టితో అడుగుతున్న కోర్కె భాషా ప్రాతిపదికపై అడుగుతున్న కోర్కె అని పొరపాటు పడవద్దని శ్రీ నెహ్రూ ప్రతిపక్ష సభ్యులకు విజ్ఞప్తి చేశారు అకాలీదళం పలుకుబడిని గోరంతలు కొండంతలుచేయడం తప్పన్నారు ఇటీవలి పంచాయతీఎన్నికలలో గ్రామీణప్రాంతాలలో చాలా తక్కువ మంది అకాలీలు ఎన్నికయినారని తన రాజ్యాధికారానికి పట్టణ ప్రాంతం ప్రజలకన్న గ్రామీణ ప్రాంతం ప్రజలే మూలస్తంభాలని ప్రధాని అన్నారు.

కమ్యూనిస్టునాయకుడు శ్రీ భూపేష్ గుప్త చర్చను ప్రారంభించారు పంజాబును భాషాప్రాతిపదికపై విభజించాలనే సూత్రాన్ని ప్రభుత్వం అంగీకరించవలసిందిగా కోరారు కమ్యూనిస్టు నాయకుడు శ్రీ జడ్ ఎ అహమ్మద్, ప్రజాసోషలిస్టుపార్టీ సభ్యుడు శ్రీ రోహిత్‌దావే యీకోర్కెను బలపరచారు.

శ్రీ హెచ్ యన్ కుంజ్రూ (స్వ) మాట్లాడుతూ, పంజాబీ, హిందీ ఒకదాని సరసన ఒకటి అభివృద్ధి చెందవలసి వుంటుందనీ పంజాబు విభజనకు అంగీకరిస్తే దేశంలో ఎడతెగనిచిక్కులు ఉత్పన్నమవుతాయనీ అన్నారు

పంజాబీ సుబా కోర్కెను శ్రీ దివాన్ చమన్‌లాల్, సర్దార్ మోహన్ సింగ్, గ్యానీ జయసింగ్, పి యన్ సప్రూ, (వీరంతా కాంగ్రెసు సభ్యులు) వ్యతిరేకించారు.

ప్రధాని నెహ్రూ బెల్గ్రేడ్ పయనం

బొంబాయి, ఆగస్టు 30

ప్రధాని నెహ్రూ నేటి రాత్రి బొంబాయిమీదుగా బెల్గ్రేడ్‌కు బయలుదేరివెళ్ళారు. ఆయనక్కడ తటస్థదేశాల శిఖరాగ్ర సభలో భారత ప్రతినిధివర్గానికి నాయకత్వం వహిస్తారు ప్రధాని నెహ్రూ ఇక్కడకు వచ్చిన సందర్భంలో వెయ్యిమంది నల్లజెండాలు చేతబూని "పంజాబీ సుబా జిందాబాద్", "తారాసింగ్ జిందాబాద్" అంటూ నినాదాలిచ్చారు ఇదే సందర్భంలో గోవారాజకీయ సదస్సుఅధ్యక్షుడు శ్రీ పోరేస్ నాయకత్వాన ఒక ప్రతినిధివర్గం ప్రధాని నెహ్రూను కలుసుకొని, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న గోవన్లకు ప్రోత్సాహమిచ్చే విధంగాభారత ప్రభుత్వ విధానంలో మార్పులురావాలని కోరుతూ ఒక మెమొరాండం సమర్పించారు

నెహ్రూ వెంట బెల్గ్రేడ్‌కు శ్రీ ఆర్ కె నెహ్రూకూడ వెళ్ళారు

కరువుభత్యం మూలవేతనంతో కలిపే సమస్యపై ఆర్థిక మంత్రి

[విశాలాంధ్ర విలేఖరి]

హైద్రాబాద్, ఆగస్టు 30

మూలవేతనంలోనే కరువుభత్యాన్ని కలిపివేసే విషయమై ప్రభుత్వం అనుక్షణమూ పరిశీలిస్తోందని రాష్ట్రఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేటిఉదయం పత్రికలవారితో మాట్లాడుతూచెప్పారు

ఈ పద్ధతి మద్రాసు పద్ధతిలో వుండాలా లేక కేంద్ర ప్రభుత్వ విధానాన్ని అనుసరించాలా అన్న విషయం కూడా పరిశీలిస్తున్నామని మంత్రి అన్నారు ఇందుకై ఏ నిర్ణయానికైనా వచ్చే ముందు ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల్ని గూర్చి పరిశీలించాల్సి వుంటుందన్నారు సెప్టెంబరు 1 న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని అప్పుడీసమస్యను తాను లేవనెత్తుతానని చెప్పారు

మద్యనిషేధం ఇప్పట్లో తెలంగాణాకు వర్తించే అవకాశంలేదు

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, ఆగస్టు 30

మద్య నిషేధాన్ని కనీసం తృతీయ ప్రణాళికాంతం వరకైనా తెలంగాణా ప్రాంతానికి వర్తింపజేసే అవకాశం లేదని ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ చెప్పారు

ఈ విషయమై యింకా రాష్ట్రప్రభుత్వానికి కేంద్రం నుండిగాని, ప్రణాళికా సంఘం నుండిగాని అభిప్రాయాలు అందలేదన్నారు అది ఆర్థిక సమస్యకు సంబంధించినది గాబట్టి అంత తేలికైన విషయం కాదన్నారు

కలరాకు 1187 మంది బలి

గయ, ఆగస్టు 29

గత మూడు నెలల్లో కలరావల్ల గయజిల్లాలో 1187 మంది చనిపోయినట్లు జిల్లా మేజస్ట్రేట్ నియ్యార్ నిన్న తెలియజేశారు మొత్తం 245 గ్రామాలకు కలరా వ్యాపించింది

మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో గత వారం కలరా వల్ల 21 మంది చనిపోయారని అధికార వార్త

ఉత్తర ప్రదేశ్ వరదల్లో 153 మంది మృతి

లక్నో, ఆగస్టు 29

ఇక్కడికి అందిన వార్తలను బట్టి, ఉత్తరప్రదేశ్ వరదలవల్ల 153 మంది మరణించారని తెలుస్తుంది ఇందులో పడవ ప్రమాదాలు కూడా ఇమిడి వున్నాయి. 449 పశువులు కూడా మరణించాయి 28 లక్షల 11 వేల ఎకరాల భూమి వరదకు గురి అయింది 32 వేల ఇండ్లు కూలిపోవడమో, నష్టపడడమో జరిగింది

వలస దేశాలకు స్వాతంత్ర్యం

నిరుడు జరిగిన నిర్ణయాన్ని ఖచ్చితంగా అమలుజరిపించాలని ఐరాసకు రష్యా సూచన

న్యూయార్క్, ఆగస్టు 30

వలసాధిపత్యాన్ని పూర్తిగా అంతమొందించాలని నిరుడు ఐరాస పదిహేనవ సర్వసభ్య వార్షిక మహాసభ చేసిన నిర్ణయాన్ని ఖచ్చితంగా అమలు జరుపవలసిందిగా, వచ్చేనెల 19 వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదహారవ వార్షిక మహాసభ ఆదేశించాలని కోరుతూ సోవియట్ విదేశాంగమంత్రి ఆంద్రీ గ్రోమికో ఐరాస కార్యాలయానికి ఒక లేఖ పంపారు

ఐరాస మహాసభ ఎజెండా, అనుబంధ ఎజెండా కూడా ప్రకటితమై పోయాయి గనుక ఈ విషయాన్ని చాల అవసర విషయంగా పరిగణించాలని ఆయన కోరారు.

అటువంటి సమస్యలను ఎజెండాలో చేర్చడానికి, హాజరయి, ఓటింగులో పాల్గొన్నవారిలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం

ఐరాస ప్రధానకార్యదర్శి అయిన హామర్షీల్డ్‌ని సోవియట్ ప్రభుత్వం గుర్తించడం మానివేసింది కాబట్టి గ్రోమికో ఈ లేఖను ఐరాస సెక్రటేరియట్‌కి పంపారు

"వలసదేశాలకూ, ప్రజలకూస్వాతంత్ర్యం ఇవ్వాలన్న నిర్ణయం అమలుకు సంబంధించిన పరిస్థితి" అన్న శీర్షికతో ఈ అంశాన్ని స్వీకరించాలని గ్రోమికో సూచించారు

"అల్జీరియా ప్రజలపై వలస పెత్తందారీ పోరాటమూ, అంగోలాలోపోర్చుగీసు ప్రభుత్వ పైశాచిక చర్యలూ, దక్షిణ, నైరుతి ఆఫ్రికాల్లో ఆఫ్రికన్ ప్రజల ఊచకోతా, కీన్యా, ఉత్తర రొడీషియాలలో జాతీయవాదులపై వలసపాలకుల మూక ఉమ్మడి ప్రతీకార చర్యలూ, ఇంకా అనేక చోట్ల వలసపాలకుల దుష్కృత్యాలూ కొనసాగుతూనే ఉన్నందున ఈ మెమొరాండములో సోవియట్ ప్రభుత్వం తన తీవ్ర నిరసనను తెలిపింది.

స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్న పార్టీల నాయకులపై దారుణ నిర్బంధాలు కొనసాగుతూనే ఉన్నాయన్నది

పంజాబీసుబాను నిరాకరించి ఫలితం లేదు

—శ్రీ ఎన్. జి. గోరే

న్యూఢిల్లీ, ఆగస్టు 30

కాంగ్రెస్‌పార్టీ సిక్కులపట్ల, ముఖ్యంగా అకాలీలపట్ల అవలంబించుతూన్న వైఖరి గురించి శ్రీ ఎన్ జి గోరే చెప్పిన కొన్నిమాటలపై నేడు లోక్‌సభలో పెద్ద గందరగోళం బయలుదేరింది స్పీకరు ఈ మాటలను రికార్డుల నుండి తొలగించివేశారు

శ్రీ గోరే తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ పంజాబీ సుబా కోర్కెను రాష్ట్రపునర్విభజన కమీషన్ సిఫారసుల సాకుతో తోసివేయడం ఎంతమాత్రం పనికిరాదని అన్నారు ఈ కమీషన్ నివేదిక సమర్పించిన తరువాత చాలా మార్పులు జరిగాయనీ, బొంబాయి రాష్ట్ర విభజన ఏవిధంగా జరిగిందో అదేవిధంగా దీనినికూడా పరిష్కరించాలనీ అన్నారు. ఈ కోర్కెను నిరాకరించి ఫలితం లేదన్నారు.

జాతీయైక్యతా సాధనకు మార్గం

లౌకిక రాజ్యాంగాన్ని అభిలషించే పార్టీలతో క్రమశిక్షణా నిబంధనావళిని తయారు చేయాలని శ్రీ హిరేన్ సూచన

(విశాలాంధ్ర విలేకరి)

న్యూఢిల్లీ, ఆగస్టు 30

నేడు లోక్‌సభలో భారత శిక్షా స్మృతి (సవరణ) బిల్లుపై చర్చ సందర్భంలో కమ్యూనిస్టు పక్ష ఉపనాయకుడు ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ మాట్లాడుతూ, దేశంలోని విచ్ఛిన్నకర ధోరణులను, రాజకీయాలలో మతధోరణులను ప్రవేశించడాన్ని నిరోధించడంతోపాటు ఈబిల్లు దేశంలోని ప్రజాతంత్రశక్తుల కార్యకలాపాలకు దోహదం చేసేదిగావుండాలని సూచించారు త్వరపడి ఈబిల్లును ప్యాస్‌చేయడానికి ప్రయత్నించరాదనీ, దీన్ని ప్రజాభిప్రాయం కోసంపంపాలనీ ఆయన కోరారు

ఈ రకమైన బిల్లును జాగ్రత్తగా రూపొందించాల్సి వుందని శ్రీ ముఖర్జీ సలహాయిచ్చారు.

మతప్రసక్తిలేని లౌకిక రాజ్యాంగాన్ని అభిలషించే పార్టీలన్నింటికీ కలిపి క్రమశిక్షణా నిబంధనావళి రూపొందడం అవసర మన్నారు. ఈ విషయంలో ప్రధాన బాధ్యతంతా కాంగ్రెస్‌పైనే వుందని చెప్పారు.

ఈ సందర్భంలో ప్రొఫెసర్ ముఖర్జీ కేరళలోని ముస్లింలీగ్‌తో కాంగ్రెస్ పొత్తునుగూర్చి, శాసనసభ స్పీకర్ ఎన్నికతంతునుగూర్చి ప్రస్తావించారు ఈ రకమైన రాజకీయ ఎత్తుగడలవల్ల వాతావరణం కలుషితమైందన్నారు ఇంతకన్నా పచ్చి అవకాశవాదం మరొకటిలేదని విమర్శించారు

వివిధ కుల మత లేదా భాషా వర్గాల మధ్య, లేదా మతాల మధ్య, జాతుల మధ్య శత్రుత్వాన్నిగాని లేదా విద్వేష భావాల్నిగాని పురిగొల్పేందుకు ప్రయత్నించినవారు శిక్షార్హులౌతారని అని ఈ బిల్లులో వుంది

విచ్ఛిన్నకర, కుల మత, వేర్పాటు ధోరణులను గట్టిగా అణచివేసేందుకుగాను ప్రభుత్వానికి అదనపుఅధికారాలనిస్తున్న ఈ బిల్లును ప్రతిపక్షసభ్యులు కొంతమందీ, కాంగ్రెస్ సభ్యులు కొంతమందీ విమర్శించారు

కమ్యూనిస్టు సభ్యులు శ్రీ హిరేన్ ముఖర్జీ బిల్లులోని మూల ఉద్దేశంతో ఏకీభావం ప్రకటిస్తూ, ఈబిల్లు విచ్ఛిన్నకర ధోరణులను అరికట్టడంతో పాటే దేశంలోని ప్రజాతంత్ర శక్తుల అభివృద్ధిని,వాటికార్యకలాపాలనుఅడ్డుకునేదిగా తయారుకారాదన్నారు జాతీయ సమైక్యతా సాధన నిమిత్తం ఇతర పార్టీల నాయకులను, ప్రముఖులను సమావేశపర్చి చర్చించడం ద్వారా కాంగ్రెస్ ఐక్యత సంఘం కర్తవ్యతను పాటించిందన్నారు ఈసంఘంతయారుచేసిన నివేదిక ఇంతవరకూ తాత్కాలిక నివేదికగానే వుందన్నారు.

దేశంలో విచ్ఛిన్నకర, వేర్పాటు ధోరణులను ఎదుర్కొనే నిమిత్తం పై విధంగానే అఖిలపార్టీ సమావేశం జరపడం మంచిదని శ్రీ ముఖర్జీ అన్నారు

కులమత ధోరణులను, విచ్ఛిన్నకర శక్తుల్ని ఎదుర్కోవడం అనేది కేవలం చట్టాలద్వారా జరిగేపనికాదన్నారు ఈ విషయమై ఎట్టి పీనల్ చర్యలు తీసుకున్నా అవన్నీ ఎంతో జాగరూకతతో జరగాల్సిన వన్నారు ప్రస్తుతం భాషా మైనారిటీలలాంటి ప్రధాన సమస్యలు దేశాన్ని ఎదుర్కొంటున్నాయని, ఇందుకు సంబంధించిన ఉద్రేకాలను మనం పంజాబ్, అస్సాంలలో చూడవచ్చునని, కాబట్టి ఈ సమస్యలను ప్రభుత్వం సానుభూతితో సదవగాహనతో పరిష్కరించాల్సి వుంటుందని శ్రీ ముఖర్జీ సూచించారు

పంజాబీసుబాసమస్యనుగూర్చిప్రస్తావిస్తూ, హోంమంత్రి అమృతసర్ వెళ్లి, అస్సాం విషయంలోలాగా పరిష్కార సాధనకు ఎందుకు ప్రయత్నించరాదు అని ప్రశ్నించారు.

కులపార్టీలను నిషేధించాలి

పి టి ఐ విలేకరి ఇంకా ఈక్రింది విషయాలు తెల్పుతున్నాడు -

అంతకుముందు శ్రీ కాసిల్వార్ (కాం)మాట్లాడుతూ,కులమతపార్టీలను నిషేధించరానిదే బిల్లు ఉద్దేశం నెరవేరదన్నారు

స్వతంత్రసభ్యుడు శ్రీ కృష్ణస్వామి బిల్లును వ్యతిరేకించారు

శ్రీ త్యాగి (కాం) మాట్లాడుతూ, వివిధ రాజకీయ పార్టీలను సమావేశపర్చి క్రమశిక్షణా నిబంధనావళిని రూపొందించాలని సూచించారు జాతీయైక్యతకు భంగం కలిగించే చర్యల్లో పాల్గొనకుండా ఈ పార్టీలు జాగ్రత్త పడాలన్నారు

పాకిస్తాన్‌లో దాచిన మాజీ నిజాం ప్రభుత్వ ధనం

త్వరలో భారత - పాక్ ప్రభుత్వాల మధ్య ఒప్పందం సాధ్యమని ఆర్థిక మంత్రి

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, ఆగస్టు 30

ఈ నాడు పాకిస్తాన్ ప్రభుత్వంవద్దనున్న పాతనిజాం ప్రభుత్వానికి చెందిన 10 లక్షల పౌనుల ధనాన్ని తిరిగి రాబట్టడం విషయమై భారత ప్రభుత్వానికి, లండన్ బ్యాంక్‌కు, పాకిస్తాన్ ప్రభుత్వానికి మధ్య త్వరలో ఒప్పందం కుదరవచ్చునని ఆంధ్ర ప్రదేశ్ ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేటి ఉదయం పత్రికలవారితో మాట్లాడుతూ తెలియజేశారు.

ఈ మొత్తాన్ని రాబట్టే విషయమై రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రం పాక్ ప్రభుత్వంతో చర్చలు సాగిస్తున్నట్లు ఆయన చెప్పారు ఈ ధనం మాజీ హైద్రాబాద్ ప్రభుత్వప్రతినిధికి, హైద్రాబాద్ సంస్థానం భారతయూనియన్‌లో విలీనంకావడానికి ముందు ఉన్నధనం పోలీసుచర్య అనంతరం ఆ నిజాంప్రభుత్వ ప్రతినిధి ఈధనాన్ని లండన్‌లోని పాక్ప్రభుత్వ అకౌంటులోకిమార్చాడు ఇందుకు ఆంధ్రప్రభుత్వం లోగడ ఇంగ్లండుబ్యాంకికీ, పాక్ ప్రభుత్వానికీ నిరసన తెలిపివుంది. ఈ మొత్తాన్ని బ్యాంకిఖాతానుండిడ్రాచేయడానికి నిజాం ప్రతినిధికి హక్కులేదని చెప్పింది. నిజాం ప్రభుత్వమూ, దానికి ఒక ప్రతినిధి అంటూ యిక లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పింది. భారత యూనియన్‌లో హైద్రాబాద్ సంస్థాన విలీనీకరణ అనంతరం నిజాంప్రభుత్వానికి కేంద్రమొక్కటే వారసురాలైనందున ఈ విషయమై కేంద్ర ప్రభుత్వమే పరిశీలించాల్సి వచ్చింది

ప్రస్తుతం జరుగుతున్న చర్చల ఫలితంగా ఒప్పందం కుదిరితే ఆ మొత్తం భారత ప్రభుత్వానికి వస్తే, అందులో ఆంధ్ర ప్రదేశ్‌కు కొంతైనా ముడుతుందని ఆర్థిక మంత్రి అన్నారు.

తనిఖీ పద్ధతిపై పశ్చిమ దేశాల కొత్త ప్రతి పాదనలు

జెనీవా, ఆగస్టు 30

అణ్వాయుధనిషేధ ఒప్పందంలోని తనిఖీ పద్ధతికి సంబంధించిన రెండు కొత్త"రాజీ" ప్రతిపాదనలను పశ్చిమ దేశాలవారు నేడు సోవియట్ యూనియన్‌కు చేశారు.

ప్రధాని ప్రకటనకు తీవ్ర ఆందోళన

పంజాబీ సమస్యపై జలంధర్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శివర్గం ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

జలంధర్, ఆగస్టు 30

పంజాబీసుబా డిమాండ్‌ను అంగీకరించరాదన్న ప్రభుత్వనిర్ణయంఇప్పట్లో మారబోదని ప్రధానమంత్రి నెహ్రూ నిన్న పార్లమెంటులో చేసిన ప్రకటన పట్ల జలంధర్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శివర్గం నిన్న నొక ప్రకటనలో తీవ్ర ఆందోళనను, ఆశాభంగాన్ని వ్యక్తంచేసింది.

ప్రధాని నెహ్రూ ప్రకటన హేతుపూర్వకమైనదీకాదు, రాజకీయ చతురతతో కూడుకున్నదీకాదని సెక్రటేరియట్ విమర్శించింది ప్రధాని ప్రకటన ఇప్పటికే ఉద్రిక్తమైయున్న పరిస్థితిని తీవ్రతరం చేస్తుందని హెచ్చరించింది ఇప్పటికైనా ప్రధాని నెహ్రూ సమయం మించి పోకుండా రాజకీయ విజ్ఞతా వైఖరితో సమస్యా పరిష్కారానికిపూనుకోవాలని జలంధర్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శివర్గం విజ్ఞప్తి చేసింది

కాలం మించిపోతోందని, జాప్యం జరిగినకొద్దీ ప్రమాదం ముంచుకొస్తుందనీ కార్యదర్శివర్గం హెచ్చరించింది జలంధర్ జిల్లాలో సభల్నీ, సమావేశాల్నీ, ఊరేగింపుల్నీ నిషేధిస్తూ నిషేధాజ్ఞలు జారీచేసినందుకు పార్టీ సెక్రటేరియట్ నిరసన తెలియజేసింది· రాజకీయ పార్టీల సాధారణ కార్యక్రమాలు సాఫీగా సాగకుండా అవరోధాలు కల్పిస్తున్నందుకు విమర్శించింది చివరకు హిందూ సిక్కు సమైక్యతను ప్రబోధిస్తున్న ఉద్యమాల్ని కూడా ప్రభుత్వం నిరోధిస్తున్నందుకు నిరసన తెలిపింది.

కమ్యూనిస్టు పార్టీ సభ్యుల అరెస్టు

పాటియాలా, సాంగ్రూర్, జలంధర్ జిల్లాల్లో కమ్యూనిస్టుపార్టీ సభ్యులనూ, చివరకు మాజీ శాసనసభ్యుడూ, ప్రముఖ స్వాతంత్ర్య యోధుడూ అయిన శ్రీ హరికిషన్ సింగ్ భాటాను అరెస్టు చేసినందుకు కార్యదర్శివర్గం తీవ్రంగా ఖండించింది ఈ చర్య నిర్హేతుకమైనదనీ, శాంతిభద్రతలకు విఘాతంకల్గిస్తోందనీ చెప్పింది అందువల్ల సభలూ, సమావేశాలూ ప్రదర్శనలపై నిర్బంధాలను రద్దుచేసి,అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈతీవ్ర పరిస్థితుల్లో వివిధ కులాలకు చెందిన ప్రజలమధ్య సౌమనస్య సద్భావాలనూ, ఐక్యతనూ కాపాడాలనీ,ప్రజలంతాప్రశాంతంగావుండాలనీ విజ్ఞప్తి చేసింది

రు 116 బహుమానం

ఖమ్మంమెట్టు జిల్లా నూగూరు తాలూకా చర్లపోస్టు గొంపల్లిగ్రామస్తురాలు కొడిచెట్టి ఎల్లమ్మ, వయస్సు 45 సం॥ చామనచాయ, పొడవు 4½ అడుగులు, బొద్దుగా వుండును. తలపై కుడి, ఎడమ, ముందు, ప్రక్కల తెలుపు వెంట్రుకలు వారు పై పన్నువరసలో మధ్యపన్ను పూసినది వంటిపైన వున్న బంగారు వస్తువులు వివరం- మెడలో కాసులపేరు, నాను, కంటె, మంగళసూత్రాలు రెండు, చెవులకు ఎర్రరాళ్ల జోడు, కుడిచేతికి దండెడెం, వెండి వస్తువులు - కాళ్ళకు వేడీలు, కట్టీలు మొత్తం మూడువేల రూపాయల విలువతో వుండగా వరంగల్లుజిల్లా బొల్లికొండ గ్రామస్తుడు గొల్ళకులస్తుడగు కర్కార్ల శ్రీహరి అనే అతను మోసగించి తీసుకెళ్ళి సుమారు 20 రోజులు అయినది వరంగల్లుజిల్లాలోనే వున్నట్లు తెలుస్తున్నది ఈ పై గుర్తులుగల ఎల్లమ్మ జాడ తెలిపినవారికిగాని, లేక పట్టియిచ్చినవారికిగాని పై బహుమానం యివ్వబడును.

ఇట్లు,
భర్త, కొడిచెట్టి పోశాలు
గొంపల్లి, చర్లపోస్టు



బి-టెక్స్
తెలుపు ఆయింటుమెంటు
తామర, దురద, చలి పగుళ్ళ వలిగే పగుళ్ళు
చిడుము మరియు మొటిమలకు

ముక్కోటి ఆంధ్రులను
మరల ఆనందపరుస్తున్న
3 వ వారం
ప్రసాద్ ఆర్టు పిక్చర్సువారి
ఇల్లరికం
దర్శకత్వం టి ప్రకాశరావు, నిర్మాత : ఎ. వి సుబ్బారావు.
— నవయుగ

వెలువడింది.

సందేశం
(సెప్టెంబరు సంచిక)

దీనిలో
అస్సాం సమస్య : (అజయఘోష్)
భారతీయ వ్యవసాయంమీద పన్నులభారం (అశోకమిత్ర)
భారతదేశంలో మధ్యతరగతి (సుహృద్‌గుప్త)
గుంటూరుజిల్లాలో - బంజరు సాగుదార్ల సమస్యలు (మందే పిచ్చయ్య)
కుటుంబం, వ్యక్తిగత ఆస్తి - రాజ్యాంగాల పుట్టుక ; (పుస్తక పరిచయం)

విడి సంచిక వెల · రు 0 50 న. పై

ప్రతులకు మేనేజరు, ‘సందేశం’
విజయవాడ-2

రేడియో

శనివారం, సెప్టెంబరు 2
శక 1883 భాద్రపద 11

విజయవాడ

357 1 మీ (840 కిలోసై)

ఉదయం · 6-30 సుప్రభాతం, 6-35 భక్తిరంజని తరంగాలు, 6-55 ప్రసారవిశేషాలు, 7-0 తె వా, 7-15 ఎ రామస్వామి వయొలిన్, 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం వా, 8-15 హిం. వా, 8-30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం. 12-30 కార్మికులకు (హై రి), 1-0 'వనితావాణి' స్త్రీలకు 'గోకుల విహారం' సంగీత రూపకం, 1-30 భజన్ ఎం ఎస్ సుబ్బులక్ష్మి, 1-50 తె. వా, 2-0 బొమ్మరిల్లు పిల్లల కార్యక్రమం, వెన్నముద్దలు - శ్రీకృష్ణ జయంతి ప్రత్యేక కార్యక్రమం, 3-0 ప్రసార సమాప్తి.

సాయంత్రం. 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 గ్రాం వా, 6-15 గ్రామస్థులకు శ్రీకృష్ణ జననం - బుర్రకథ, 7-0 తె. వా, 7-15 గ్రామస్థులకు, 7-30 కృష్ణావతార తత్త్వము - ప్రసంగము, 7-40 ఫిల్మ్ సంగీతం, 8-0 ఎ రామస్వామి వయొలిన్, 8-30 రేడియో న్యూస్‌రీల్ (ఢి రి), 8-40 లలితసంగీతము ఎ. ఎమ్ రాజా, పి. నాగేశ్వరరావు, 9-0 ఆం. వా, 9-15 నాటిక (హై రి), 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం (ఢి. రి), 11-0 ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - ఎ.

405.4 మీ. (740 కిలోసై.)

ఉదయం 6-30 సుప్రభాత్, 6-35 భక్తిరంజని - కృష్ణావతార తత్త్వము (వి రి), 6-55 కార్యక్రమ వివరణ; 7-0 తె. వా, 7-15 విజయవాడ వలె, 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం. వా, 8-15 హిం వా, 8-30 బృందగానం, 8-45 ప్రసార సమాప్తి

మధ్యాహ్నం. 12-30 కార్మికులకు, 1-0 'వనితా వాణి' (వి రి), 1-30 లలిత సంగీత్, 1-50 తె వా, 2-0 హై వి వలె, 2-10 ఉ వా, 2-21 హై వి. వలె, 2-30 ప్రసార సమాప్తి

3-45 బాలానందం - చిన్నపిల్లల కార్యక్రమం, 4-15 ప్రసార సమాప్తి

సాయంత్రం. 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాంతీయవార్తలు, 6-15 కన్నడ శ్రోతలకు, 7-0 తె వా, 7-15 ప్రసంగం (హిందీ); 7-30 ప్రసంగం (వి రి), 7-40 టాగూరుపై ప్రసంగం (ఉర్దూ), 7-50 విరామ సంగీతం, 7-55 శ్రోతల ఉత్తరాలకు జవాబులు (ఉర్దూ), 8-0 ఆంగ్ల ప్రసంగము, 8-15 హైదరియా బస్నీ భాయా సంగీత రూపకము, 8-30 రేడియో న్యూస్ రీల్, 8-40 విరామ సంగీతం, 8-45 రేటి ప్రసంగము; 9-0 ఆం వా, 9-15 ఉ వా; 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం (ఢి. రి), 11-0 ప్రసార సమాప్తి

హైద్రాబాద్ - బి

49 02 మీ (6120 కిలోసై)

ఉదయం: 6-30 హై ఎ వలె, 8-45 ప్రసార సమాప్తి.

40 02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం 12-30 హై. ఎ. వలె, 2-0 రామదాస్ కీర్తనలు. పి వీరయ్యచౌదరి, 2-30 ప్రసారసమాప్తి

3-45 హై ఎ వలె, 4-15 ప్రసార సమాప్తి

60 12మీ (4990 కిలోసై)

సాయంత్రం · 6-0 హై. ఎ. వలె; 6-15 గ్రామస్థులకు, 7-0 తె. వా, 7-15 గ్రామస్థులకు, 7-30 హై ఎ వలె, 7-49 ప్రాదేశిక సుగమ్ సంగీత్, 8-0 హైద్రాబాద్ ఎ వలె, 9-15 దొంగదారి - నాటిక, 9-30 హై ఎ వలె, 11-0 సమాప్తి

మద్రాస్ - బి

211 3 మీ (1420 కిలోసై)

ఉదయం. 6-45 మంగళగానం, 7-0 తె వా, 7-15 'సుప్రభాతమ్' సంస్కృత కార్యక్రమం - కాళిదాసుని 'శాకుంతల' 6 వ అంకం; 7-30 వ ఎ వలె, 8-0 ఆం.వా, 8-15 ప్రసార సమాప్తి.

211.3 మీ (1420 కిలోసై)

మధ్యాహ్నం: 1-0 వ ఎ వలె, 1-30 ఆం వా, 1-40 గీతమంజరి, 1-50 తె వా, 2-0 మధురగీతం, 2-10 మత్తుక్కువియల్ పిల్లల కార్యక్రమం [తమిళం], 2-20 సమాప్తి.

211.3 మీ (1420 కిలోసై)

సాయంత్రం 5-30 పాశ్చాత్య సంగీతం; 5-50 స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-0 ఆం వా, 6-15 కార్యక్రమ వివరణ (తమిళం), 6-20 పల్లడం సాగరాజారావు వేణువు, 7-0 తె వా, 7-15 సంగీతమాల, 7-30 'అమావాస్యైయిల్ అందకారం' నాటిక (తమిళం), 8-30 అయ్యలూర్ కృష్ణన్; 9-0 ఆం. వా, 9-15 మద్రాసు అభివృద్ధి కార్యక్రమం, 9-25 వాద్యసంగీతం, 9-30 పాశ్చాత్య సంగీతం, 11-0 ప్రసార సమాప్తి

టెలిగ్రాఫ్ తీగలను దొంగిలించిన వారికి కఠినశిక్షలను విధించ వానికి వీలుగా టెలిగ్రాఫ్ తీగల చట్టాన్ని సవరించనున్నారు.

అంకెలగారడీతో కూడిన

'సోషలిస్టుతరహా సమాజం'లో పేదలబ్రతుకు మరీ దుర్భరమైంది

తెనాలి బహిరంగసభలో శ్రీ హనుమంతరావు ఉపన్యాసం

పేదలపాలిటికి మిగిలినవల్లా అధికధరలు, నిరుద్యోగము, అధికపన్నులూనని వివరణ

తెనాలి, ఆగష్టు 29

"గత రెండుప్రణాళికల కాలంలో, దేశంలో ఎంతో అభివృద్ధి సాగినట్లు ప్రణాళికాశాఖ, పాలకవర్గం అంకెల్లో చూపుతున్నవి జాతీయాదాయం పెరిగిందని తలసరి లెక్కలుకట్టి అంకెలు చూపుతున్నారు కానీ నిజంగా మనదేశంలో సామాన్యుల ఆదాయం పెరిగిందా? లేదు పెరిగిన సంపద కొద్దిమంది చేతుల్లోకి పోయింది కాగా సామాన్యులకు మిగిలినది నిరుద్యోగం, అధికపన్నులు, వస్తువుల ధరల పెరుగుదల, నిజవేతనాల కోత ఇలా సామాన్యప్రజల జీవితం మరీ దుర్భరమైంది"అని ప్రదేశ్ కమ్యూనిస్టు నాయకులు శ్రీ మోటూరు హనుమంతరావుగారు రీటీవల యిక్కడ జరిగిన బహిరంగసభలో వివరించారు.

తెనాలి మునిసిపల్ ఉపఎన్నికలలో 2వ వార్డునుండి కమ్యూనిస్టు అభ్యర్థిగా ఎన్నుకోబడిన శ్రీ రావి హైమారావు గారి అధ్యక్షతక్రింద రణరంగచౌక్‌లో యీ బహిరంగసభ జరిగింది సభకు 2 వేలకు పైగా ప్రజలు వచ్చారు.

శ్రీ హనుమంతరావుగారు తమ ప్రసంగంలో ఇంకా యిలా అన్నారు:

ప్రణాళికల పేరుతో పరోక్షపన్నులు పెంచారు నోట్లు ముద్రణం కలిగింది విదేశాలనుండి కోట్లధనం అప్పులుచేసి-వడ్డీలు చెల్లించుచున్నారు ఆహారంలో నన్నా దేశాన్ని స్వయంపోషకం చేయలేకపోయారు కనీసం తమ తీర్మానాల ద్వారా చెప్పుకొన్న భూసంస్కరణలన్నా అమలు చేయలేకపోయారు కాంగ్రెస్ మంత్రివర్గాలు భూసంస్కరణలని కొన్ని అమలుచేశారు కాగా భూములుమాత్రం మిగలలేదు. పేదలకు పంచే సమస్యకూడా ఏర్పడలేదు

ఇక బంజర్ల పంపకంలో పేదలకు కాకుండా, రాజకీయ బాధితుల పేరుతో కొన్ని పంచారు కల్గినవారికే కొన్ని భూములు పంచారు. అనేక ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి, అనేక కష్టనష్టాలకోర్చి సాగు చేసుకొంటున్న పేదల స్వాధీనంలో వున్న బంజర్లను ఖాళీ చేయించుటకు నోటీసులిస్తున్నారు

సోషలిస్టు తరహా రాజ్యవ్యవస్థ అంటున్నారు. ఈ తరహా వ్యవస్థ పాలనలో పేదలు నిరుపేదలుగా మారి పోతున్నారు ఉన్నవారు ఇంకా కూడబెట్టుకొని లక్షలనుండి కోటానుకోట్లు సంపాదించుకో గల్గుచున్నారు

ఇదే సోషలిస్టు తరహా సమాజవ్యవస్థ అని పాలకవర్గ పార్టీ కాంగ్రెస్ ప్రచారం చేస్తున్నది. ఈ మాత్రందాన్ని చూచి రంగాగారి స్వతంత్ర పార్టీ కంగారు పడుతున్నది. వారు వ్యక్తి స్వేచ్ఛ-వ్యక్తి స్వాతంత్ర్యం కూలిపోతున్నదని కాంగ్రెస్‌ను దుయ్యబట్టుతున్నారు

ఒక్క కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానగల దేశాల్లో - సోషలిస్టుసమాజ స్థాపన సాధ్యమైంది ఈనాడు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన సోవియట్, జెకోస్లోవేకియా, బల్గేరియా, రుమేనియా లాంటి దేశాల్లో - చైనాలో సోషలిస్టు వ్యవస్థా నిర్మాణం సాగుతున్నది సోషలిస్టు వ్యవస్థలో పేదలస్థితి మెరుగు తుంది కలవారి దోపిడీ పోతుంది ఇదే సోషలిస్టు వ్యవస్థకు గీటురాయి కేవలం తీర్మానాలు, ప్రకటనలు ఒక తీరుగా చెప్పి-ఆచరణ మరోరూపంలో వుంటే - సోషలిస్టు నిర్మాణం సాధ్యం కాదు

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామిక వ్యవస్థకు హానిజరిగినది కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దుచేయడంలో వెనుకాడలేదు పంచాయతీలనుండి - మునిసిపాలిటీల వరకూ తన అనుచరులు అధికారంలో లేకపోతే రద్దు చేయుటానికి వెనుకాడలేదు గతంలో తెనాలి మునిసిపాలిటీ రద్దుకు పై తెల్పిన కారణంకాక మరొకటి చెప్పలేరు!

ఎన్నికలలో ప్రజాస్వామిక సూత్రాలకు కాంగ్రెసు తిలోదకాలు యిచ్చింది అధికారదాహంతో, పార్టీ ప్రయోజనాలతో ప్రారంభించి-మూఠా-గ్రూపు రాజకీయాల వరకు దిగజారింది

ఇలాంటి పార్టీకి దేశంలో కష్టజీవులు, మేధావులు, మధ్యతరగతివారు సమాధానం చెప్పగలరని ఆశించుచున్నాను"

తర్వాత 2వ వార్డు ఉపఎన్నికలో కమ్యూనిస్టుపార్టీ విజయానికి సహాయపడిన ప్రజలకు అభినందనలు తెలిపారు

తరువాత శ్రీ రావి అమ్మయ్యగారు ఉపన్యసిస్తూ, ఈ ఎన్నికలో కాంగ్రెస్ పేరుతో, జూదశాల యజమానీ, మరొక బ్రాకెటు కంపెనీ యజమానీ ధనాన్ని విపరీతంగావాడి కమ్యూనిస్టు పార్టీని ఓడించాలని ప్రయత్నం చేశారనీ, సంఘ విద్రోహులైనవారు ఏ ముసుగు వేసుకొన్నా తప్పక అపజయం పొందగలరనీ చెప్పారు.

బ్రాకెట్ కంపెనీల - జూదశాలల ధనంతో కాంగ్రెస్‌పార్టీ - ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీని ఓడించే ప్రయత్నం సాగనివ్వరని ఈ వార్డు ఎన్నిక రుజువు పరచినదని, పట్టణంలో యువకులంతా ముందుకువచ్చి రాజకీయ జీవితంలో సంఘ విద్రోహులైన ఈ బ్రాకెట్ మార్కెట్ - జూదశాలల ప్రాబల్యం తుడిచిపెట్టాలని మనవిచేశారు.

శ్రీ అమ్మయ్యగారు శ్రీ చిట్టా కోటయ్యను ఈ సందర్భంలో సన్మానించుతూ ఆయన్ను గురించి ఇలా పరిచయం చేశారు. "1942 ఉద్యమ వృత్తవీరుల స్మారాన్ని ఎంతో ఘనంగా జరిపి, శ్రీ సంజీవరెడ్డిగారినికూడా పిలిపించి ఆవిష్కరణ జరిపారు ఆ సందర్భంలో జాతీయోద్యమానికి సంబంధం లేని వ్యక్తిని అధ్యక్షుణ్ణిగా పెట్టారు కాని అక్కడ 1942లో తుపాకీగుండు బుగ్గలోనుండి పోగా గాయపడిన శ్రీ కోటయ్యగారికి స్థానమే లేక పోయింది ఆ గాయం ఇప్పటికీ ఆయన్ను బాధపెడుతూనే వుంది 1942 తర్వాత రెండు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారు. నిరుపేద వృద్ధుడు అయినా ఆయనకు రాజకీయ బాధితుడుగా భూమిని కూడా ఇవ్వ నిరాకరించారు ఇప్పుడు కాంగ్రెసులో ఏకాపతు అగ్రస్థానానికి వచ్చిందో ఇదే నిదర్శనం"

ఆరాత్రి రెండవవార్డులో శ్రీ కోనూరు పున్నయ్యగారిచే "అర్జునతీర్థయాత్ర" హరికథ చెప్పబడింది. (వి వి)

విశాఖపట్నంలో మున్సిపాలిటీలో మార్కెట్ వార్డుశానిటరీఇన్‌స్పెక్టర్‌గా 8 యేళ్లనుండి వుండిన శ్రీ రాఘవరావు గారిని బందరుకు బదిలీ చేసిన సందర్భంగా ఆవార్డులోని శానిటరీ సిబ్బంది ఆగష్టు 27 న సన్మానంచేశారు.

బజారు ధరలు

విజయవాడ, ఆగష్టు 31
(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం	
మేలిమి పొట్లు	145 8 0
మూరు	145 0 0
నవరసు	97 13 0
వెండి. 100 తులములు	286 0 0
1 తులము	2 6 0
ధాన్యం (కొత్తవి)	
24 నెంబరు	88 0 0
సంకరసన్నాలు	81 0 0
అక్కుళ్లు	28 8 0
కుసుమ	”
బియ్యం (కొత్తవి)	
24 నెంబరు	78 0 0
సంకరసన్నాలు	71 0 0
అక్కుళ్ళు	65/- 66 0 0
కుసుమ	”
అపరాలు	
మినుములు (100 కి)	52 0 0
కందులు (100 కి) 80/-	84 0 0
పల్ల పెసలు [మూగాజి]	47 0 0
పచ్చ పెసలు 280	42 0 0
సెనగలు(పంజాబ్)921.	40 8 0
ధనియాలులత్తి(408)	80/- 82 0
ఉలవలు (100 కి)	32/- 40 12 0
ఆముదాలు (75 కి)	58 8 0
పంచదార(ఉయ్యూరు)	116 4/-
కొబ్బరినూనెడబ్బా 1½ వ.	89 14 0
బెల్లం 10 కి	7 12 0 9 0 0
బెల్లం 11.20 కి.	8 4 0 5 12 0
మిర్చి 10 కి(కొత్త)	16/- 18 0 0
పీకల్లి ”	8 0 0 8 10 0
చింతపండు(10కి)	6/- 9 0 0
సుబ్బులమూరి ” వ.	22 0 0
ఆగ్రహ్య పేట	87 0 0
కోడాడు	77 0 0
వేరుశనగపప్పునూనెమణుగు	24 7 0
కే 160 పౌనులు	26 12 0
కొబ్బరికాయలు 1000	228/-
సంచులు 100	140 0 0
డిటో ఫార్వర్డు	125 0 0
నత్రము 2 వ నట్టు	14 0 0
నత్రము 3 నట్టు	16 0 0

వేటపాలెం రిక్షా యజమానుల లాకౌట్

వేటపాలెం, ఆగష్టు 28

బాపట్లతాలూకా వేటపాలెం రిక్షా యజమానులు ఆగష్టు 24 న హఠాత్తుగా లాకవుట్ చేశారు. ఇందువలన 50 కుటుంబాల రిక్షాకార్మికులు తిండి లేక చాల బాధలు పడుచున్నారు

ఆగష్టు 25 న వేటపాలెం సబ్‌ఇన్‌స్పెక్టరుకు రిక్షా యజమానులు లాకవుట్ చేసినట్లు కార్మికులు రిపోర్టు ఇచ్చారు అందుమీదట సబ్‌ఇన్‌స్పెక్టరు ఉభయులనూ పిలిపించారు. లాకవుటు చెయ్యలేదనీ కార్మికులేబండ్లుతీసుకొనిపోకుండ సమ్మెచేసినారు అని చెప్పారు సబ్‌ఇన్‌స్పెక్టరు మామూలుగా మీరు బండ్లు తీసుకుంటారా అని కార్మికులను అడిగారు తీసుకుంటాము అని వారు బదులు చెప్పారు. దానిపై బండ్లు యివ్వవలసినదిగా యజమానులకు చెప్పారు బండ్లు రిపేరులో ఉన్నవి, ఇచ్చుటకు వీలులేదు అని యజమానులు తిరస్కరించి వెళ్ళిపోయారు రాత్రికి యజమానులను, కార్మికులను పిలిపించి సబ్‌ఇన్‌స్పెక్టరు యజమానులను మీ కోర్కెలను తెలియచెయ్యవలసినదిగా కోరగా, అందుకు వారునిరాకరించి తిరిగి వెళ్ళిపోయారు తరువాత కార్మికులు ఎ ఎస్ పి., జిల్లా పోలీసు సూపరింటెండెంటుకు టెలిగ్రాములను, మహజర్లను పంపించారు.

ఇంతవరకూ విచారణ జరుగలేదు ఆగష్టు 28 న పోటీ కార్మికులను తీసుకొనివచ్చి బళ్లు బయటకు పంపుటకు ప్రయత్నం చేయుచున్నారు లైసెన్సులేని బండ్లను లైసెన్సులేని డ్రయివర్ల నడుపుచున్నారు ఈ రోజు వరకూ లాకౌట్ సాగుతూనే ఉన్నది

నక్కలకాల్వ పొంగు: 1200 ఎ॥ పైరు ముంపు

కాల్వ వంపులుదిద్దుతూ వెడల్పుచేసిన మట్టిని కంట్రాక్టర్లు కాల్వలోనే పోసిన ఫలితం

అచంట, ఆగష్టు 30

ఈ మధ్య కురిసిన వర్షములవల్లనూ, గోదావరినదికి వచ్చిన వరదల మూలంగానూ నక్కలకాల్వ పొంగి కేసవరం, పడమటిపాలెంలకు చెందిన తాడిగొంది, పుర్ర, పడమటిపాలెంల తాలూకు 1200 ఎకరముల 'వరిపైరు' మునిగి పూర్తిగా వరిచేలన్నీ పాడైపోయినవి.

గోదావరికి వరద వచ్చినప్పుడల్లా లక్ష్మిపాలెం లాకు తలుపులు మూసేస్తారు దాని మూలంగా గోదావరి లాకి మార్గంలేక నక్కల కాల్వ పొంగి చాలా గ్రామాలకు చెందిన వరి చేలు మునిగిపోతూ ఉంటాయి. ఈ రకంగా వేలాది ఎకరాలు ఏటా నష్టపడుతున్నవి ఈ ముంపుకు పరిష్కారమార్గం నక్కల కాల్వకు వంపులు తీసి వెడల్పుచేస్తూ, కాజ కాల్వలోకి మళ్ళించటం కాని ఈ మధ్య ప్రభుత్వం కొన్నిచోట్ల వంపులు తీయడానికి కంట్రాక్టర్లకు పని యిచ్చారు కాని వారు సక్రమంగాచేయక త్రవ్విన మట్టిని కాల్వలోనే పోశారు. దాని మూలంగా వెడల్పుచేసినా ఉపయోగం లేక కాల్వ మెరక అయిపోయింది

ప్రస్తుతం ఈ ముంపుమూలంగా నష్టపడిన భూములకు పూర్తి రెమిషను ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. (వి వి)

ఒకే ప్రసవంలో ముగ్గురు బిడ్డలు

విశాఖపట్నం, ఆగష్టు 28

విశాఖపట్నం గవర్నమెంటు క్వీన్ విక్టోరియా ఆస్పత్రి (ఘోషా ఆస్పత్రి)లో విశాఖపట్నం బుక్కావీధి కాపురస్థురాలు శ్రీమతి పెదపూడి వరహారత్నం అనే ఆమె ఆగష్టు 19 న ఒకే ప్రసవంలో ఇద్దరు మగపిల్లలను, ఒక ఆడపిల్లను ప్రసవించింది. ఆడపిల్ల 28 వ తేదీన చనిపోయింది. మగపిల్లలిద్దరూ, తల్లీ కులాసాగా వున్నారు

కి. శే. మాలకొండయ్య గ్రంథాలయానికివిరాళం

సంతనూతలపాడు, ఆగష్టు 28

కీ శే కనుమర్తి మాలకొండయ్య గ్రంథాలయ నిర్మాణం, విగ్రహప్రతిష్ఠ స్మారకసభలకుగాను గుంటూరుజిల్లా సంతనూతలపాడు పంచాయతీ సమితి అధ్యక్షులు, సమితి సభ్యులనుండి టంగుటూరు గ్రామ కమ్యూనిస్టు కమిటీ రూ. 70/-లు విరాళ మిచ్చారు.

'విశాలాంధ్ర' వారోత్సవాలు

కాట్రేనికోన, ఆగష్టు 29

తూర్పుగోదావరిజిల్లా అమలాపురం తాలూకా కాట్రేనికోన గ్రామకమ్యూనిస్టుపార్టీ శాఖాసమావేశం ఆగష్టు 25న శ్రీ కోటిపల్లి వెంకన్నగారి అధ్యక్షత జరిగింది సమావేశమునకు శ్రీ చింతపల్లి కృష్ణమూర్తిగారు హాజరై జిల్లా కౌన్సిల్ నిర్ణయాలు వివరించారు. విశాలాంధ్ర పత్రికలను పది కాపీలు ఈ గ్రామానికి తెప్పించాలనీ, విశాలాంధ్ర భవన నిర్మాణానికి రు 5 వెంటనే పంపాలనీ తీర్మానించారు

ఈ ప్రాంతంలోవున్న బంజర్లను గతంలో ఆక్రమణ చేసుకొన్న వారికి, ముందుగా దరఖాస్తులు చేసినవారికి పట్టాలు మంజూరు చేయించాలనితీర్మానించారు

అమలాపురం తాలూకా కొత్తలంక గ్రామంలో 10 పత్రికలకు చందాలు కట్టించాలనీ, విశాలాంధ్రనిధికి రు 5 లు పంపాలనీ గ్రామ కమ్యూనిస్టుశాఖ సమావేశంలో తీర్మానించారు

అమలాపురంతాలూకా గొద్దనాపల్లి (కొప్పిగుంట) గ్రామ కమ్యూనిస్టుపార్టీ శాఖా సమావేశం శ్రీ కముజు సూర్యనారాయణగారి అధ్యక్షతను జరిగింది. ఈ గ్రామంలోకి విశాలాంధ్ర పత్రికలు తెప్పించుటకు, విశాలాంధ్ర భవన నిర్మాణమునకు రు 5లు విరాళంపంపించుటకు తీర్మానించారు

తూ. గో జిల్లా పల్లిపాలెం కమ్యూనిస్టుశాఖ సం॥ చందాను, భవననిధికి రు 5 లను పంపనిర్ణయించింది.

కొమానపల్లె గేదెల్లంక ఆరు 'విశాలాంధ్ర' పత్రికలను తెప్పించాలని నిర్ణయించారు

తాడికొండశాఖ కమ్యూనిస్టుకమిటీ విశాలాంధ్రభవననిధికి రు 90లు పంపాలనీ, 'విశాలాంధ్ర'కు 30 కాపీలు హెచ్చించాలనీ నిర్ణయించింది.

తాళ్లూరు బ్రాంచి కమ్యూనిస్టు కమిటీ 9 సం॥ చందాలు, 9 అర్ధ సం॥ చందాలు చేర్పించాలనీ, 8 శాఖల నుండి శాఖకు రు. 5 లు తగ్గకుండా భవన నిధికి పంపాలనీ నిర్ణయించింది.

కమ్యూనిస్టుపార్టీ రాజీనామాల తతంగం

కొందరు కాంగ్రెసువారు చేయిస్తున్న మోసం

నిడదవోలు, ఆగష్టు 29

తాము కమ్యూనిస్టు పార్టీకి రాజీనామానిస్తూ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి దరఖాస్తు చేసుకొన్నట్లు ఒక విజయవాడ దినపత్రికలో వచ్చిన వార్తను, ఆ వార్తను పంపినవారి మోసాన్ని ఖండిస్తూ నిడదవోలునుండి శ్రీయుతులు తీపర్తి స్వామి, తీపర్తి సుబ్బారావు, జుత్తిగ గణేశ్వరరావు గార్లు యిలా వ్రాస్తున్నారు

"28-8-61 వ తేదీ "ఆంధ్రజ్యోతి" 5 వ పేజి 1 వ కాలంలో నిడదవోలు నుండి కమ్యూనిస్టుపార్టీకి మత్స్యకారి గ్రామికులు రాజీనామా యిచ్చినట్లుగా ప్రకటించారు. మేమూ, మరికొంత మంది మత్స్యకారిగ్రామికులము కలిసి గత 15 సంవత్సరములనుండి కమ్యూనిస్టుపార్టీతోనున్న సంబంధము తెగతెంపులు చేసుకొన్నామనీ, కాంగ్రెసులో చేరుటకు నిర్ణయించుకొన్నామనీ అందులో వుంది అది నిజంకాదు

నిడదవోలుమండల కాంగ్రెసు కార్యదర్శి మాకద్దకువచ్చి చెరువులు యిప్పిస్తామని, యింకా యేవో కొన్ని కల్పించి మాలోని కొంతమందిచే వేలిముద్రలు వేయించి సంతకాలు చేయించి ఈ విధంగా మమ్మల్ని మోసగించారు

మేముగాని యితరులుగాని కమ్యూనిస్టు పార్టీకి రాజీనామా చేయలేదు సరికదా కాంగ్రెసు సభ్యత్వమునకు దరఖాస్తు పెట్టనూలేదు మేము మా సంఘీయులం గతములోవలెనే కమ్యూనిస్టుపార్టీపట్ల భక్తి విశ్వాసములు కలిగియున్నాము కష్టజీవులపట్ల కమ్యూనిస్టు పార్టీకి ఉన్నంతశ్రద్ధ మరే రాజకీయ పార్టీకి లేదని దృఢముగా నమ్ముచున్నాము" (వి.వి)

రైల్వే కార్మికుని మృతి

రామచంద్రపురం, ఆగష్టు 29

ద్వారపూడి రైల్వే స్టేషన్ వద్ద ఆగష్టు 22 వ తేదీ సాయంత్రం రైలు పట్టాలు వేగన్‌లోకి ఎక్కించుచుండగా ఒక పట్టా తలకుతగిలి గొర్రె జానకి (25 సం॥) అనే రైల్వే కూలీ తల పగిలినది అతడు ఆ సాయంత్రం 6-30 గంటలకు చనిపోయినాడు.

తిక్కోని పెండ్లిలో తిన్నోడే బుద్ధిమంతుడు!

4½% లోన్ పితలాటకాలు

చీపురుపల్లి, ఆగష్టు 29

శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లి తాలూకాలో సుమారు రు 7 లక్షలు 4½ % అప్పులు వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ పనికి జిల్లా కలెక్టరు నుండిగ్రామాధికారివరకూ రాత్రింబగళ్లు ఇతర పనులు మూలకుపెట్టి ఈ వసూలులోనే నిమగ్నమయ్యారు

ఎవరైనా రు 4లు యిస్తే గవర్నమెంటుకు రు 100ల అప్పు యిప్పించినట్టేట! ఆ రు 4లుబ్యాంకువాళ్ళకు విరాళంగాయిస్తే బ్యాంకు రేటుకు అప్పు లభిస్తుందట' గ్రామాల్లో యింటింటికీతిరిగి రు 1,2,3లు ఆ కుటుంబ ఆర్థిక స్తోమతనుబట్టి [illegible] వసూళ్ళు చేస్తున్నారు పట్టణాల్లో అన్నివిధాలైన వర్తకుల నుండి యిదేవిధంగా వసూలు చేస్తున్నారు

ఇచ్చినడబ్బుకు రశీదులేదు. ఇందువల్ల ఏగ్రామంలో ఎంత వసూలైందో లెక్కలేదు ఇందువల్ల గ్రామంలోని వసూలు మొత్తం గ్రామాధికారి ఎంత చెప్పితేఅంతే దీనికి రుజువు, సాక్ష్యం ఏఆధారాలూలేవు ఫిర్కాలో మొత్తం రెవెన్యూ ఇన్‌స్పెక్టరు చెప్పిందే సత్యం తాలూకా మొత్తంవసూలు తహశీల్దారు ఎంత చెప్పితే అంతే! ఇందులో ఏం కుంభకోణం జరుగుతుందోగాని ఏ ఒక్కరిమీదా ఇంకొకరికి నమ్మకం లేదు ప్రజల్ని పీడించడం మినహా వసూలైనదంతా ప్రభుత్వానికి చేరుతుందా? అన్నదే అనుమానం ఈ వసూళ్ళకు ఏదో రూపంలో ఓచరు యుంటే ఈ అనుమానాలకు ఆస్కారముండదు కాని, వసూలుచేసేవారికి ఇప్పటి శ్రద్ధ యుండదనేది ప్రభుత్వం గూడా అర్థంచేసుకొనే ఈ 4½ శాతము అప్పును యీ విధంగా ప్రవేశపెట్టిందా అని అనుకుంటున్నారు (వి వి.)

నూజివీడు తాలూకా బంజరు కేసులు

సెప్టెంబరు 2న చర్చిస్తామని ముఖ్యమంత్రి హామీ

హైద్రాబాద్, ఆగష్టు 30

నూజివీడు తాలూకా బంజరు సాగుదార్లపై బనాయించిన ఫారెస్టు కేసుల నుపసంహరించుకొనే విషయాన్ని సెప్టెంబర్ 2 వ తేదీన జరిగే మంత్రి మండలి సమావేశంలో తప్పక చర్చిస్తామని తనను నిన్న యిక్కడ కలుసుకొన్న ఒక రాయబారవర్గానికి ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యగారు చెప్పారు

నూజివీడు తాలూకా బంజరు సాగుదార్ల తరఫున శాసనసభ్యులు శ్రీ గుంటూరు బాపనయ్య, శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, శ్రీ యం. నాగిరెడ్డి, తాలూకా బంజరు సాగుదార్ల సంఘాధ్యక్షులు శ్రీ దాసరి నాగభూషణరావుగార్లు నిన్న ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యగారిని కలుసుకున్నారు. అడవి బంజర్లపంపకం, నూజివీడుతాలూకాలో బంజరు సాగుదార్లపై ఫారెస్టు శాఖవారు బనాయించిన కేసులు మొదలగు విషయాలపై ముఖ్యమంత్రితో ఈ రాయబారవర్గంవారు చర్చించారు.

సాగుదార్లపై బనాయించిన ఫారెస్టు కేసులను తక్షణంఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రిని వారు అర్థించారు

సెప్టెంబరు 2 వ తేదీన జరిగే మంత్రి మండలి సమావేశంలో చర్చించిన తర్వాత నూజివీడు తాలూకా బంజరు సాగుదార్ల కోర్కెలపై తాము నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలమని ముఖ్యమంత్రి వాగ్దానం చేశారు. సాగుదార్లపై బనాయించిన ఫారెస్టు కేసులను ఉపసంహరించే విషయం సానుభూతితో పరిశీలిస్తామని రాయబారవర్గానికి ముఖ్యమంత్రి వాగ్దానమిచ్చారు.

లోగడ ఆగష్టు 9 వ తేదీన నూజివీడుతాలూకా బంజరు సాగుదార్ల తరఫునఒక రాయబారవర్గం ముఖ్యమంత్రిని చూచినది పాఠకులకు విదితమే

కృష్ణాజిల్లా బంజరు సాగుదార్ల సభ

సెప్టెంబరు 6 న నూజివీడులో

నూజివీడు, ఆగష్టు 30

కృష్ణాజిల్లా బంజరుసాగుదార్ల మహాసభ సెప్టెంబరు 6 వ తేదీన నూజివీడులో జరుగుతుంది ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు మహాసభను ప్రారంభిస్తారు. 6 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి ప్రతినిధుల సమావేశం జరుగుతుంది ప్రతినిధులంతా భోజనం ఖర్చులు తామే భరించుకోవాల్సి వుంటుందని ఆహ్వాన సంఘంతరపున శ్రీ ఎస్ ఆర్. దాసరిగారు తెలుపుతున్నారు

కర్నూలుజిల్లా ద్రోణాచలం పంచాయతీసమితి ఆధ్వర్యాన ఉ కేనపురం గ్రామములో గ్రామసేవక శిక్షణశిబిరము ఆగష్టు 22 నుండి 24 వరకు జరిగింది.

అనంతపురం జిల్లా అంతటా క్షామసూచన

ముందుగానే అధికారులు మేల్కొని జాగ్రత్త పడాలని జిల్లా రై॥సం॥ ఉపాధ్యక్షుని ప్రకటన

"గోరుచుట్టుపై రోకటిపోటు"గా ఋణ సేకరణకు గ్రామాలపై అధికారుల దండు పయనం

కెల్పుమడుగు, ఆగష్టు 30

అనంతపురంజిల్లాలో నాలుగోయేడుకూడా క్షామదేవత ప్రత్యక్షమయ్యే సూచనలప్పుడే అగుపిస్తున్నాయి కొన్ని ప్రాంతాల్లో అంకా విత్తనం పడలేదు కొన్నిప్రాంతాల్లో మే, జూన్ నెలల్లో వచ్చిన వర్షాలకు విత్తనం పడింది కాని ఆ తర్వాత వర్షాలు రానందువల్ల పైర్లు ఎండిపోతున్నాయి చెరువులకు నీరు రాలేదు బావుల్లో నీరు తగ్గుతున్నది కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ, ముంగారి యెండిపోయింది కొర్రకూడా యింకొక వారంరోజులు వర్షం రాకపోతే ఎండిపోక తప్పదు

ఈపరిస్థితులను వివరిస్తూ జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షులు శ్రీ పి హనుమంతరెడ్డిగారు చేసిన ప్రకటన యిలా వుంది

"ఉరవకొండ మొత్తంతాలూకాలో వేరుశనగ ఎండిపోతున్నది ఇక వారం రోజులలో వర్షం రాకపోతే విషమ పరిస్థితులు తప్పవు కళ్యాణదుర్గం తాలూకాలో యిప్పటికే పరిస్థితి విషమించింది. కూలీలు ఆకలిబాధలతో జీవిస్తున్నట్లు, దొంగతనాలు ప్రారంభమయినట్లు వార్తలొస్తున్నవి.

ధర్మవరం తాలూకా మొత్తంగా పంటలు దెబ్బతిన్నాయి అనంతపురం తాలూకాలో శింగనమల ఫిర్కాలో కొద్దిమాత్రంగా మినహాయిస్తే మిగిలిన ప్రాంతమంతా పైర్లు ఎండిపోతున్నాయి పెనుకొండ తాలూకాలో కొత్తచెర్వు, బుక్కపట్నం ప్రాంతాలంతప్ప మిగిలిన ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నవి. మడకశిర తాలూకాలోకూడా పరిస్థితి బాగులేదు పోతే గుత్తి, తాడిపత్రి తాలూకాల్లో ఉత్తరభాగంనుండి కొద్దిగా సంతోషించదగిన వార్తలు వచ్చాయి కాని ఆరెండుతాలూకాల్లో దక్షిణభాగం పంటలు దెబ్బతినే సూచనలు కనబడుతున్నవి ఇప్పటి కేమో ఋతుపవనాలు విఫలమైనట్లే అగుపడుతున్నది. మున్ముందు వర్షాలు వచ్చినా, దానివల్ల రేగడి తాలూకాలైన ఉరవకొండ, గుత్తి, తాడిపత్రి (దీనిలో గూడా కొద్ది ప్రాంతాలే) తాలూకాలకు తప్ప మిగిలిన తాలూకాలకు అంత లాభం వుండదు.

కాన ప్రభుత్వము వారు దూరదృష్టితో వెంటనే అన్ని తాలూకాలలోనూ పరిస్థితులను పరిశీలించి తగు చర్యలు గైకొనాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ సమయంలోనే అన్ని తాలూకాల్లోనూ ఆయా తాలూకా అధికార్లు ప్రభుత్వ ఋణాలను వసూలుచేయుటకు ప్రజలపై [illegible] కాన ప్రతి గ్రామంలోను రైతులు, కూలీలు ఆ అధికార్లను కలుసుకొని ఉన్న పరిస్థితి వివరించి తక్షణచర్యలు గైకొనే టట్లు అధికార్లకు విజ్ఞప్తి చేయాలి ఇందులో రైతుసంఘ కార్యకర్తలు బాగా చొరవతీసుకొని ఆయా గ్రామాల్లోని ప్రజలను అక్కడికక్కడే సమీకరించి అధికార్లకు విజ్ఞప్తులు అందచేయాలి."

ఎలక్ట్రిక్‌షాక్ తగిలి కార్మికుని మృతి

కాకినాడ, ఆగష్టు 28

ఈనెల 24 న శ్రీ రామదాసు మోటారు ట్రాన్సుపోర్టు కంపెనీ వర్కుషాపులో శ్రీ కె సాంబశివరావు అను వర్కరు ఎలెక్ట్రిక్ గ్రైండరుతో పని చేస్తుండగా ఎలెక్ట్రిక్ షాక్ తగిలి వెంటనే చనిపోయాడు మోటారు, ఇంజనీరింగు, ఫౌండ్రీ వర్కర్సు అంతా సమావేశమయి శ్రీ సాంబశివరావు మృతికి గాఢ సంతాపాన్ని తెలియచేస్తూ తీర్మానించారు శవమును పెద్ద ఊరేగింపుతో శ్మశానమునకు తీసుకొని వెళ్ళారు ఊరేగింపులో వివిధ ఇంజనీరింగ్ కంపెనీల కార్మికులు పాల్గొన్నారు (వి వి)

సభలు - సమావేశాలు

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం సబ్ డివిజన్ రైస్ ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశం సెప్టెంబరు 8 వ మధ్యాహ్నం 12 గంటలకు అమలాపురంలో జరుగుతుంది

* * *

ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ కార్యవర్గం హైద్రాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సెప్టెంబరు 5వ మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమవుతుంది.

◆ ◆ ◆

ఖమ్మం పట్టణ యువజన సంఘ విస్తృత సమావేశం సెప్టెంబరు 3 న ఉదయం 8 గంటలకు జరుగుతుంది.

◆ ◆ *

తూర్పుగోదావరిజిల్లా యువజన సంఘ మహాసభల ఆహ్వానసంఘ సమావేశం అమలాపురంలో కొల్లూరివారి సత్రంలో సెప్టెంబరు 3వ తేదీ ఉదయం 11 గంటలనుండే జరుగుతుంది.

* * *

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం సెప్టెంబరు 8, 9 తేదీలలో అమలాపురంలో జరుగుతుంది సభకు జిల్లా కమిటీ కార్యదర్శి శ్రీ పెదపాటి వెంకట్రావుగారు హాజరౌతారు.

* * *

తూర్పుగోదావరిజిల్లా అమలాపురం తాలూకా రైతుసంఘ కార్యకర్తల సమావేశం సెప్టెంబరు 3వతేదీ మధ్యాహ్నం అమలాపురంలో శ్రీ ముళ్ళపూడి అనంతరావుగారి ఇంటివద్ద జరుగుతుంది

◆ ◆ ◆

ఒంగోలు తాలూకాలోని ఒంగోలు, మద్దిపాడు, కొప్పోలు, సంతనూతలపాడు, అమ్మనబ్రోలు, పంచాయతీ సమితి ప్రాథమికోపాధ్యాయ సంఘముల అధ్యక్ష - కార్యదర్శుల సమావేశము సెప్టెంబరు 3వ తేది ఆదివారము పగలు 12 గంటలకు జరుగుతుంది.

* * *

విజయవాడ హనుమాన్లపేటలో డాక్టరు టి. వి ఎస్. చలపతిరావుగారి నూతన భవనములో చిన్మయ మిషన్ ఆధ్వర్యమున 1-9-61 న సాయంత్రం 6 గంటలకు "శ్రీకృష్ణ జయంతి"ని గురించి శ్రీ డి. వి. కృష్ణయ్యగారు ఉపన్యసిస్తారు. 3-9-61 న సా॥ 6 గంటలకు సత్సంగ సమావేశం, శ్రీ చిట్టి పురుషోత్తమ సోమయాజులుగారి వేదాంతోపన్యాసం వుంటాయి.

◆ ◆ ◆

వుయ్యూరు ఏరియా కమ్యూనిస్టు పార్టీ సభ్యుల-సానుభూతిపరుల సమావేశం పెద ఓగిరాలలో సెప్టెంబరు 4 న మధ్యాహ్నం 12 గంటలనుండి జరుగుతుంది శ్రీ చంద్ర రాజేశ్వరరావు, శ్రీ జె ఎస్.ఆర్ శాస్త్రిగార్లుహాజరవుతారు

హరిజనుల సాగు భూమి ఆక్రమణకు పట్వారీ అక్రమాలు

ముఖ్యమంత్రికి బండరావిరాల హరిజనుల విజ్ఞప్తి

హైద్రాబాద్, ఆగష్టు 29

హైదరాబాదుజిల్లా బండరావిరాల జాగీరు గ్రామం ఆకాలములో జాగీర్దారు ఆ గ్రామ హరిజనులకు, యితర బీదలకు రమారమి 20 యకరాల భూమి యిచ్చారు ఈ భూమిని నేటివరకు ఆ బీదలు చేసుకుంటూ వస్తున్నారు. బందోబస్తు సమయంలో గ్రామ పటేలు, పట్వారీలు ఈ భూమిని ఈ బీదలకు దక్కకుండా చేయుటానికి, తాము కాజేయుటానికి గౌట్ నంబరు క్రింద పెట్టించారు. రమారమి తొంభై యెకరాల గౌటునంబరులో పటేలు, పట్వారీలు తమ పేర ఒక 20 ఎకరాలు వ్రాసుకున్నారు కాని ఆ యెకరాలపై యెకరాలు ఎక్కడనో స్వాధీనము చేసుకోవడం జరగలేదు హరిజనుల ప్రయాసాల కోర్చి సేద్యానికి తెచ్చిన ఈ బీదల యెకరాలపై కన్నువేసి తమదని తగాదా పెడుతున్నారు ఈ భూమి వివాదం యిప్పటికి 10-12 సంవత్సరాల నుండి నడుస్తున్నది బీదలు కచ్చేరీలచుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయారు.

హైద్రాబాద్‌జిల్లా బండరావిరాల హరిజనులు 30 మంది జిల్లాకమ్యూనిస్టు నాయకులు శ్రీ కె కృష్ణమూర్తిగారి నాయకత్వాన హైద్రాబాద్‌కు రాయబారం వెళ్ళి ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్యగారికి 26 వ తేదీన తమ సాగులోని భూమిని పట్వారీ ఆక్రమిస్తున్న విషయంపై మహజరు అందజేశారు విచారణ జరిపించి న్యాయం కలుగజేస్తామని ముఖ్యమంత్రి వాగ్దానం చేశారు. ఉప ముఖ్యమంత్రికీ, హైదరాబాదు జిల్లాకలెక్టరు కూడా వారు విజ్ఞప్తు లందజేశారు.

విశాఖ నౌకాకార్మిక సమ్మె కొనసాగింపు

విశాఖపట్నం, ఆగస్టు 30

విశాఖ నౌకానిర్మాణకేంద్రం కార్మికుల సమ్మె ప్రారంభించి నేటికి 19 రోజులైంది. ఇంతవరకూ పరిష్కార సూచనలు ఏమీ కనబడటం లేదు. రాష్ట్ర కార్మికశాఖా మంత్రి ప్రతిపాదనపై ఢిల్లీలో సంప్రదింపులు జరపడానికి కార్మిక నాయకులు బయలుదేరి వెళ్ళారు. ఈ నెల 25 వ తేదీన ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులు శ్రీ ఎమ్ వి భద్రం, 26 వ తేదీన జిల్లాకలెక్టరు నౌకా కేంద్రంలో తిరిగి పని ప్రారంభించడానికి జరిపిన కృషి ఫలించలేదు. షిడిబెర్తులో స్లింగింగ్ పనికి నియోగించిన కార్మికులకు తాత్కాలికంగా పనికి రోజుకు ఒక్క అణా చొప్పున యివ్వాలన్న కోర్కెపై అంగీకారం కుదరలేదు. ఈ విషయంలోకూడా తమంతతామై మేనేజిమెంటు ఎంతమాత్రం సర్దుబాటు వైఖరి చూపలేకపోయింది. సమ్మె ప్రారంభం కావడానికి ముందు, అటుపిమ్మటకూడా ఈ వివాదాన్ని ఏవిధంగా నివారించుదామా? పరిష్కరించుదామా? అని గాక ప్రతిష్ఠ కాపాడుకోవడమే ప్రధాన సమస్య అయిపోయింది.

మేనేజిమెంటు వివాద పరిష్కారానికి పూనుకోకుండా మొండివైఖరి అవలంబించడానికిగల అంతరార్థం ఇటీవల కొంతవరకు తెలియవస్తుంది.

ఈ నెల 7 లేక 8 వ తేదీలలో కేంద్ర రవాణాశాఖ మంత్రి శ్రీ రాజ్ బహదూర్ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర కార్మిక శాఖ ఉద్యోగులు, నౌకా కేంద్రం మేనేజింగ్ డైరక్టరు పాల్గొన్నారు. ఎనిమిది కోర్కెలను ఆర్బిట్రేషన్‌కు, ఎనిమిది కోర్కెలు అడ్జుడికేషన్‌కు, మరో ఎనిమిది కోర్కెలు పంపాలనీ, అయిదు కోర్కెలు నిరాకరించారు, మూడు కోర్కెలను అంగీకరించారు. ఆవిధంగా రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులను పంపారు.

నౌకా కేంద్రం కార్మికసంఘ సర్వసభ్యసమావేశం తమ తరఫున ప్రాతినిధ్యం వహించడానికి అధికారం ఇచ్చిన డాక్టర్ లంక సుందరంగారు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో చేసిన నిర్ణయాలను అంగీకరించారు. ఒక విభాగంలో ప్రారంభమైన సమ్మె విరమించబడుతుందని హామీ యిచ్చారు. జనరల్ సమ్మె ప్రారంభం కాదనికూడా హామీ యిచ్చారు. అయితే ఈ విధంగా అంగీకరించుకున్నట్లు, హామీ యిస్తున్నట్లు కార్మిక సంఘానికి తెలియజేయలేదు. శ్రీ సుందరం ఇచ్చినహామీ వలననే మేనేజిమెంటు మొండివైఖరి అవలంబించడానికి ఇదే కారణం.

శనివారం సగం రోజు శెలవు

ఉద్యోగులకు ఇచ్చే ఉద్దేశం లేదని శ్రీ మొరార్జీ

న్యూఢిల్లీ, ఆగస్టు 30

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు శనివారంనాడు ఒకపూట శెలవు ఇచ్చే పాత పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టాలనే యోచన లేదని ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి నేడు లోక్ సభలో అన్నారు.

శ్రీ యస్ ఎం బెనర్జీ వేసిన ప్రశ్నకు పైవిధంగా శ్రీ దేశాయి జవాబుచెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల క్యాజువల్ లీవు 12 నుంచి 15 రోజులకు పెంచాలని ప్రభుత్వంఆలోచిస్తున్న మాట నిజమేనా అని కూడా శ్రీ బెనర్జీ అడిగారు. ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతిలో మార్పు ఉండదని దానికి మంత్రి జవాబు చెప్పారు.

పే కమిషన్ చేసిన సిఫారసులన్నింటిని అమలు చేశారా, లేకపోతే అమలు చేయడానికి ఎంతకాలం పడుతుంది అని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ యం ఎలియాస్ ప్రశ్నించారు. పే కమిషన్ సిఫారసుల సంఖ్య, అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెద్దది అవడం మూలాన వాటిని పరిశీలించి, అమలు చేయడానికి కొంతకాలం పడుతుందని శ్రీ దేశాయి సమాధానం చెప్పారు.

పాకిస్తానీయులు 62 మంది అరెస్టు

భోజ్, ఆగస్టు 30

పాస్‌పోర్టులులేకుండా కచ్‌లో ప్రవేశించిన 62 మంది పాకిస్తాన్ జాతీయులను సరిహద్దు పోలీసులు నేడు అరెస్టు చేసినట్లు ఇక్కడ తెలియవచ్చింది.

ఈ తరహా పాకిస్తానీయులు కచ్‌లో ఈవిధంగా ప్రవేశించడం ఇది రెండవ సారి. "పంజాబీ ముస్లింల హింసలు"ను తప్పించుకొనడానికి తాము పాకిస్తాన్ నుంచి పారిపోయివచ్చామని అరెస్టయిన వారు సరిహద్దు పోలీసులతో అన్నట్లు తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలు

కాకినాడ, ఆగస్టు 30

ఆంధ్ర పాలిటెక్నిక్, కాకినాడ వారు 1961 జూన్ నెలలో నిర్వహించిన టెక్నికల్ ఎడ్యుకేషన్ పరీక్షల్లో యీ క్రింది నంబర్లు గలవారు ఉత్తీర్ణులయ్యారు

ఆర్క్, గ్యాస్ వెల్డింగ్

ప్రథమశ్రేణి: లేరు

ద్వితీయశ్రేణి 1 నుండి 4 8 10 11 12 14 15 17 21 28.

ఆటో సర్వీసింగ్

ప్రథమశ్రేణి 18

ద్వితీయశ్రేణి 1 నుంచి 9 17 నుంచి 19 22 నుంచి 29 31 నుంచి 34

కార్పెంటరీ, క్యాబినెట్ మేకింగ్

ప్రథమశ్రేణి లేరు

ద్వితీయశ్రేణి. 2 4 నుండి 10 12 13 15 నుండి 17, 19 20 22 నుండి 34 36 37 39

ఎలక్ట్రికల్ వైరింగ్

ప్రథమశ్రేణి 1 4 7 15 18 20

ద్వితీయశ్రేణి 2 3 5 6 8 నుండి 14 16 17 21 23 24 27 30 32 33 35 నుండి 40 43 45 47 49 50 54 55 62 65 నుండి 67 69 నుండి 72 75 76 78 82 84 85 89 నుండి 92 97 99 104 106 107 116 117 121 123 130 131 135 137 నుండి 139 142 నుండి 144 146 147 149 నుండి 154 156 158 నుండి 161 165 170 173 184 నుండి 187 189 193 198 నుండి 200 202 204 206 నుండి 209 214 నుండి 216 222 నుండి 225 227 231 233 నుండి 235 237 239 240 242 244 నుండి 249

జనరల్ మెకానిక్స్

ప్రథమశ్రేణి 1 2 6 8 నుండి 10

ద్వితీయశ్రేణి 3 4 7 11 నుండి 16 19 22 25 26 27 29 33 నుండి 36 38 39 41 42 43 45 నుండి 52 57 58 60 61 69

హ్యాండ్లూమ్ వీవింగ్

ప్రథమశ్రేణి: లేరు

ద్వితీయశ్రేణి 1 నుండి 10 12 14

ఈ క్రింది నంబర్లు తర్వాత ప్రకటించబడతాయి.

ఆటో సర్వీసింగ్ 15 20

జనరల్ మెకానిక్స్. 5 20

ఐరాస అల్టిమేటం ధిక్కరణ

కిరాయి సైనికులకు ఆశ్రయం

ఎలిజబెత్‌విల్లీ, ఆగస్టు 30

తమవద్ద ఆశ్రయంపొందిన యూరోపియన్లను నేటిఉదయం 9 గంటలలోగా అప్పగించివేయాలని ఐరాస ఇచ్చిన అల్టిమేటంను విదేశ దౌత్య ప్రతినిధులు ధిక్కరించారు. ఈ యూరోపియన్లు కాటంగా సైన్యంలో పనిచేస్తున్నారు.

అన్నింటికి తెగించి ఉన్న యూరోపియన్ సైనికులు తిరుగుబాటు జరపగలరని అనుమానిస్తున్నట్లు ఐరాస ప్రతినిధి ఓబ్రియాన్ ప్రకటించారు. వీధులలో సాయుధులైన సైనికుల గస్తీ తిరుగుతున్నారు.

బెల్జియన్ సైనికాధికారులు విమానంలో ఇంటికి వెళ్ళి పోవడానికి తాను ఏర్పాట్లు చేసేవరకు తన కార్యాలయంలోనే వుంటారని బెల్జియం దౌత్యప్రతినిధిఅన్నారు. వారిని ఐరాసకు అప్పగించడానికి ఆయన నిరాకరించారు. బెల్జియం దౌత్యకార్యాలయంలో 30 మంది బెల్జియన్ సైనికాధికారులు ఆశ్రయం పొందారు. తమను ఐరాస అరెస్టుచేస్తుందని భయపడుతున్నట్లు వారు చెప్పారు.

కాటంగా నుంచి యూరోపియన్ సైనికాధికారులను పంపివేయడానికి సోమవారంనాడు ఐరాస జరిపిన దాడి అధికారాలను మించి జరిగిందని షోంబే నిన్న అన్నారు.

సింహళ భాషలో భారత చిత్రాల డబ్బింగ్‌పై నిషేధం

సింహళ ప్రభుత్వ ఉత్తర్వు

న్యూఢిల్లీ, ఆగస్టు 30

సింహళభాషా చిత్రాలను భారత దేశంలో తయారు చేయడం, ఆ భాషలో భారతదేశ చిత్రాలను డబ్బింగ్ చేయడం సింహళ ప్రభుత్వం నిషేధించింది. రాజ్యసభలో కేంద్ర సమాచార రేడియో ప్రసార మంత్రి డా బి వి కేస్కర్ ఈవిషయం వెల్లడించారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"1956-59 వరకు సింహళదేశం చిత్రనిర్మాతలు మద్రాసు స్టుడియోలలో సింహళ భాషా చిత్రాలను తయారు చేశారు. 1960 సంవత్సరం సంగతి తెలియదు.

బహుశా ఆర్థిక కారణాలవల్లే సింహళ ప్రభుత్వం ఈచర్య తీసుకొని వుండవచ్చునని డా కేస్కర్ అన్నారు.

లావోస్ అజమాయిషీసంఘం ఛైర్మన్ పైద. వియత్నాం ఆంక్ష

వీసాలేకుండాదేశంలో ప్రవేశించకూడదని ఉత్తర్వు

సైగాన్, ఆగస్టు 30

లావోస్ అంతర్జాతీయ అజమాయిషీ సంఘం అధ్యక్షుడు శ్రీ సమర్ సేన్ వీసా లేకుండా దక్షిణ వియత్నాంలో ప్రవేశించడానికి దక్షిణ వియత్నాం ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఈ విషయాన్ని అధికార వర్గాలు నేడు వెల్లడించాయి.

వియత్నాం, లావోస్, కాంబోడియా అంతర్జాతీయ అజమాయిషీ సంఘాల ప్రధాన కార్యదర్శుల సమావేశం సైగాన్‌లో ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశానికి రాదలచిన శ్రీ సమర్ సేన్‌కు దక్షిణ వియత్నాం ప్రభుత్వం అనుమతి నిరాకరించింది.

1954 లో జరిగిన జెనీవా ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ అజమాయిషీ సంఘాల సభ్యులు వీసాలులేకుండానే వియత్నాం, లావోస్, కాంబోడియాలలో స్వేచ్ఛగా ప్రయాణించవచ్చును. కాని ఈఒప్పందాన్ని దక్షిణవియత్నాం ప్రభుత్వం తృణీకరిస్తున్నది.

ప్రభుత్వం శ్రీ సమర్ సేన్ పై విధించిన ఆంక్ష ఫలితంగా అజమాయిషీ సంఘాల ప్రధాన కార్యదర్శుల సమావేశం కాంబోడియాలోని నాంపెన్‌లో జరుపుకోవలసి వచ్చింది. సమావేశం నేడు నాంపెన్‌లో ప్రారంభమైంది.

బ్రెజిల్ లో ప్రతిష్టంభన

రియోడిజనిరో, ఆగస్టు 30

ఉపాధ్యక్షుడు గౌలార్ట్ స్థానంపై పార్లమెంటుకు, సైనిక నాయకులకు అంగీకారం కుదరనందున బ్రెజిల్‌లో రాజకీయ సంక్షోభం అపరిష్కృతంగా ఉంది.

రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం గౌలార్ట్‌కి అధ్యక్షపదవి ఇస్తూనే అసలు అధికారమంతా మంత్రి వర్గానికి కట్టబెట్టే పరిష్కారాన్ని పార్లమెంటు సూచిస్తుందని రాజధాని బ్రెజీలియా నుండి వార్తలందాయి. అతివాద కార్మిక నాయకుడైన గౌలార్ట్‌కు స్థానం ఉండే ఏ పరిష్కారాన్నీ సైనికాధిపతులు అంగీకరించరని కొత్త న్యాయమంత్రి ఓడ్రీగ్స్ అన్నారు. గౌలార్ట్‌ను బ్రెజిల్‌కు రానీయకూడదనే సైనికాధిపతుల నిర్ణయంలో మార్పు ఉన్న సూచనలు కనిపించడంలేదు.

ప్రపంచ శాంతి

బర్మా ప్రధాని ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ప్రపంచశాంతి సాధనకు తాము చేయగలిగినంత చేయాలనే ఉద్దేశంతోనే బెల్‌గ్రేడ్‌కు వెళ్తున్నట్లు బర్మా ప్రధాని యూ-నూ నేడిక్కడ అన్నారు. బెల్‌గ్రేడ్‌కు బయలుదేరనుండు పాలం విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన పైవిధంగా అన్నారు.

పడమటి బెర్లినుకు పశ్చిమ దేశాల వారు వెళ్ళడానికి అవకాశం ఉండాలని ఆయన ఒక ప్రశ్నకు జవాబు చెప్పారు. జర్మనీకి స్వయం నిర్ణయాధికారం ఉండాలనే విషయంలో మీ వైఖరి ఏమిటని ఆయనను ఒక విదేశీ విలేకరి ప్రశ్నించారు. "అందరు ప్రజలకు స్వయం నిర్ణయాధికారం ఉండాలని కోరుతాం" అని యూ-నూ జవాబు చెప్పారు.

బెల్ గ్రేడ్ కు వివిధ దేశాధిపతులరాక

బెల్‌గ్రేడ్, ఆగస్టు 30

శుక్రవారంనాడు ప్రారంభం కానున్న తటస్థ రాజ్యాల సభలో అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్, మాలి అధ్యక్షుడు మోడిబో కైటా, అల్జీరియా ప్రధాని బెన్‌ఖెడ్డా, సూడాన్ అధ్యక్షుడు ఇబ్రహీంఅబ్బౌద్ నేడు ఇక్కడకువచ్చారు.

రాజ్యసభ విశేషాలు

అధికార ప్రతినిధి వర్గాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ప్రభుత్వం ఏర్పాటు చేసిన పర్యటనల సందర్భంలో విదేశాలకు అధికార ప్రతినిధి వర్గాలను పంపే విషయమై, అధికార, అనధికార ప్రతినిధి వర్గాలలోని ముఖ్యులను ఇలా వెళ్ళకుండా నిరుత్సాహ పరుస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి జారీచేసిన సర్క్యులర్ నేడు రాజ్యసభలో ప్రస్తావనకు వచ్చింది. అటువంటి సర్క్యులర్ వెలువడ్డ మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. అనధికారులు స్వంతఖర్చుపై విదేశాలకు వెళ్ళగోరితే విదేశ మారక ద్రవ్యం యిస్తారా అని ప్రశ్నించగా, అన్నీ సక్రమంగా వుంటే యిస్తామని మంత్రి చెప్పారు.

ప్రధాని బెల్గ్రేడ్ యాత్ర

కాంగ్రెసు సభ్యుడు దివాన్ చమన్ లాల్ మాట్లాడుతూ, ప్రధాని నెహ్రూ బెల్గ్రేడ్, మాస్కో-యాత్ర జయప్రదం కావాలని కాంక్షిస్తూ, ప్రధాని విదేశాలలో వుండగా స్వదేశంలోఎట్టి అవాంఛనీయ ఘటనా జరక్కుండా వుండాలని మనం ప్రతిన బూనాలన్నారు. దీనిపై శ్రీ నెహ్రూమాట్లాడుతూ, తాను తిరిగి వచ్చిన తరువాత మాత్రం ఆపనిజరగదని ఆశిస్తున్నానని చెప్పారు (నవ్వు).

కర్నల్ భట్టాచార్యపై పాకిస్తాన్‌లో విచారణ

రాజ్యసభలో మంత్రి వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 30

పాకిస్తాన్ సైనిక కోర్టులో విచారించబడుతున్న కర్నల్ భట్టాచార్య తరఫున తగు వాదన జరిపించేందుకు ఆయన కుటుంబమువారు ఎటువంటి సౌకర్యాలను కోరితే అటువంటి సౌకర్యాలను చేస్తామని భారత ప్రభుత్వం తెలియజేసింది.

నేడు రాజ్యసభలో శ్రీ దయాభాయి పటేలు అడిగినప్రశ్నకు ప్రధాని నెహ్రూ సమాధానం చెబుతూ పైవిధంగా అన్నారు. ఈ విషయాన్ని శ్రీ భట్టాచార్య కుటుంబంవారు ఆయనకు తెలియజేయాలనీ, శ్రీ భట్టాచార్య అందుకు అంగీకరిస్తే ఇక్కడి నుండి ఒక న్యాయవాదిని పాకిస్తాన్‌కు పంపిస్తామనీ, ఖర్చులు భరిస్తామనీ శ్రీ నెహ్రూ అన్నారు. నెహ్రూ ఇంకా ఇలా తెలియజేశారు:

"రెండు మూడు రోజులక్రితం ఢక్కాలోని భారత హైకమిషనర్ కర్నల్ భట్టాచార్యను కలుసుకున్నారు. ఇద్దరుముగ్గురు పాకిస్తాన్ ఉద్యోగులు కూడా ఉన్నారు. తనకు న్యాయవాదిని ఏర్పాటు చేయవలసిందిగా పాక్ ప్రభుత్వాన్ని భట్టాచార్య ఆ సందర్భంలో కోరారు. అందుపై కొందరు స్థానిక న్యాయవాదులను పాకిస్తాన్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. మనకు సంబంధించినంతవరకు భట్టాచార్య కుటుంబానికి ఆయనకు కావలసిన న్యాయవాది ఏర్పాటుకేతదితరసౌకర్యాలను కలిగించవలసిందనీ, అందుకు అయ్యే డబ్బు యిస్తామనీ తెలియపరిచాము.

శ్రీ భూపేష్ గుప్త: భారత ప్రభుత్వమే న్యాయవాదిని ఏర్పాటుచేసి పాకిస్తాన్ విచారణాధికారాన్ని అంగీకరించినట్టు అవుతుంది. అందుచేత మీ విచారణాధికారాన్ని అంగీకరించబోవడంలేదని చెబుతూనే పాకిస్తాన్ న్యాయవాదులకంటే యిక్కడనుండి న్యాయవాదిని ఎందుకు పంపకూడదు?

శ్రీ నెహ్రూ: ఈ విషయంలో మేము న్యాయవాదుల సలహా తీసుకున్నాము. మనము ఈ విచారణ తతంగాన్ని యేమాత్రం అంగీకరించడంలేదు. అందుకనే శ్రీ భట్టాచార్య కుటుంబానికి పైవిధంగా తెలియపరిచాము.

శ్రీ జస్వంత్ సింగ్: ఢక్కాలోని భారత హైకమిషనర్ భట్టాచార్యను ఒంటరిగా కలుసుకోడానికి అనుమతి కోరారా?

ప్రధానినెహ్రూ: మన హైకమిషనర్ పదేపదే ఈకోర్కె వెలిబుచ్చాడు, కాని, వారు నిరాకరించారు. పాకిస్తాన్ ఉద్యోగులసమక్షంలోనైనాసరే భట్టాచార్యను కలుసుకోవాలని తెలియజేశాము. లేని పక్షంలో అతనిని కలుసుకోవడమే సాధ్యమయ్యేదికాదు.

శ్రీ ఎ డి మణి: భట్టాచార్య తనకు భారతీయన్యాయవాదులే కావాలని కోరాడా? లేక పాకిస్తాన్ నియమించే ఏ న్యాయవాది అయినా సరే అన్నారా?

శ్రీ నెహ్రూ: నాకు తెలిసినంత వరకూ కర్నల్ భట్టాచార్య నిశ్చితమైన విధంగా అడుగలేదు. ఈ విషయమై అక్కడనుండి వివరంగా ఏమీ నివేదిక రాలేదు.

సెప్టెంబరు 8 వ తేదీ మంగళగిరిలో చేనేత సంఘం కార్యవర్గసభ జరుగుతుంది

ఋణ సేకరణకై చిన్న వర్తకులపై అధికారుల ఒత్తిడి

వసూళ్ళకు రసీదు లివ్వని వైనం

అనంతపురం, ఆగస్టు 30

ప్రభుత్వానికి ఋణ సేకరణలో అధికారులు పెట్టుతున్న ఒత్తిడికి తాళలేక వ్యాపారులు, ముఖ్యంగా చిన్న వ్యాపారులు చాలా బాధపడుతున్నారు. "ఈ ప్రభుత్వానికి పోయేకాల మెప్పుడు వస్తుందో!" అని శాపనార్థాలు పెడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేయదలచుకున్న పది కోట్ల అప్పుకోసం, అప్పుడే ప్రభుత్వోద్యోగులు ప్రజలపై దాడిచేసి, నానా బీభత్సం చేస్తున్నారు. సేల్స్‌టాక్స్ అధికారులు వర్తకులమీద, ఆర్ టి ఓ ఆఫీసువారు బస్సుల, లారీలవారిమీద, తాసీల్దారు, బి డి ఓ లు పల్లెలమీద పడినారు. చిన్నచిన్న వర్తకులు, ఒకలారీ, బస్సు కలిగిన వారితోకూడా నిర్బంధంగా, విచక్షణలేకుండా వసూలు చేస్తున్నారు.

వానలులేక వ్యాపారాలు లేవనీ, తాము ప్రభుత్వానికి అప్పు ఇచ్చే స్థితిలోలేమనీ ఎంత మొరపెట్టుకున్నా అధికారులు పోటీతో నిర్బంధంగా వసూలు చేస్తున్నారు. చాలామందిదగ్గర కమీషను వసూలు చేసుకుంటున్నారు. దానిని యేబ్యాంకులలోనో డిపాజిట్టు చేసి అప్పు పొందుతున్నారు. అధికార్లు మాత్రం "మాదేముంది పైవారి ఉత్తర్వుల మేరకు మేము వసూలు చేస్తున్నా"మని సమాధానము చెప్పుకుపోతున్నారు. చాలా వసూళ్ళకు రసీదులు యివ్వడం లేదని తెలుస్తూవుంది. (వి వి)

రు. 10 కోట్ల ఋణ సేకరణ

సెప్టెంబర్ 4 కే పూర్తి కాగలదని ఆర్థికమంత్రి విశ్వాసం

హైదరాబాద్, ఆగస్టు 30

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన పదికోట్ల రూపాయల ఋణసేకరణ సెప్టెంబర్ 4 వ తేదీకి అనుకున్నట్లుగా పూర్తికాగలదని ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ అన్నారు.

మూడవ ఫైనాన్స్ కమిషన్ ఇటీవల ఈ రాష్ట్రాన్ని సందర్శించినపుడు ఎక్కువ ఆర్థిక సహాయం చేయవలసిందిగా ప్రభుత్వం కోరిందనీ, ప్రభుత్వ కోర్కె "సమంజసం"గనుక కమిషన్‌ను ఒప్పించడం సాధ్యమనీ ఆర్థిక మంత్రి అన్నారు. (వి. వి)

నేరవిచారణను మాపీచేయుటకు [illegible] ఉత్తరప్రదేశ్ పోలీసు శాఖపై ప్రత్యేక తనిఖీ మొదలు పెట్టారు

రష్యానిర్ణయం

(1 వ పేజీ తరువాయి 2 వ కాలం)

ప్రభుత్వం మరోకసారి నొక్కిచెప్పింది.

సంపూర్ణ, సమగ్ర నిరాయుధీకరణకై కృషిని పదింతలు పెంచవలసిందిగా అన్ని దేశాల ప్రజలనూ, ప్రభుత్వాలనూ సోవియట్ ప్రభుత్వం ఈ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

వాషింగ్టన్‌లో ప్రకటన

వాషింగ్టన్, ఆగస్టు 31

అణ్వస్త్ర పరీక్షలను తిరిగి ప్రారంభించేందుకు సోవియట్ నిర్ణయించుకుందని అమెరికా విదేశాంగశాఖ వాషింగ్టన్‌లో గతరాత్రి ప్రకటించింది. సోవియట్ నిర్ణయాన్ని తెలుపుతూన్న 'టాస్' ప్రసారాన్ని తాము విన్నామని ఈ శాఖ అధికారులు తెలిపారు.

ఇందుకోసం వీరు హడావిడిగా గత రాత్రి ఒక పత్రికాగోష్ఠి జరిపారు.

'సోవియట్ మధ్యాసియా పత్రికా కార్యాలయాలకు ఉద్దేశించిన టాస్ ప్రసారాన్ని తాము విన్నామన్నారు.

ఈ పత్రికా గోష్ఠిలో విదేశాంగ మంత్రి డీన్‌రస్క్ స్వయంగా మాట్లాడాలనుకున్నారట. కాని అది సాధ్యం కాకపోయింది. విదేశాంగశాఖ ప్రచారోద్యోగి లింకన్ వైట్ మాట్లాడారు.

కెన్నడీ మామూలుగా జరిపే పత్రికా గోష్ఠి జరిగిన తరువాత కొంతసేపటికి ఈ ప్రత్యేక పత్రికా గోష్ఠి జరిగింది.

అణ్వస్త్ర చర్చలనుండి అమెరికా ప్రతినిధి ఉపసంహరణ

వాషింగ్టన్, ఆగస్టు 30

అణ్వస్త్ర పరీక్షల నిలుపుదల విషయమై జెనీవాలో జరుగుతూన్న సమావేశంనుండి అమెరికా ప్రతినిధి అయిన ఆర్థర్ డీన్‌ని వెనక్కు రప్పిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు కెన్నడీ నేడొక ప్రకటన చేశారు.

"అణ్వస్త్రపరీక్షలను తిరిగి ప్రారంభించడానికి నిర్ణయించడంతో సోవియట్ యూనియన్ మానవజాతికి ఎంతగానో జవాబుదారీవహించవలసి ఉంటుంద"ని కెన్నడీ తన ప్రకటనలో అన్నారు.

"జాతీయ ప్రయోజనాలకు ఏది అవసరమో నిర్ణయించవలసిన అవసరం అమెరికా కిప్పుడు కలిగింద"ని ఆయన తన ప్రకటనలో తెలిపారు.

అణ్వస్త్రపరీక్షలను నిలిపివేయాలని ఐరాస చేసిన నిర్ణయాన్ని పూర్తిగా ధిక్కరించి సోవియట్ ఇప్పుడీ నిశ్చయానికి వచ్చిందని ఆయన ఆరోపించారు.

సోవియట్ నిర్ణయాలతో ప్రపంచానికి అణుయుద్ధ ప్రమాదం ఇనుమడించిందని వ్యాఖ్యానించారు.

తాను సంపూర్ణ సమగ్ర నిరాయుధీకరణనే కోరుతున్నట్లు సోవియట్ చేస్తూ వచ్చిన ప్రకటనలు "ఎంత కపటమయినవో" ఇప్పటి సోవియట్ నిర్ణయం స్పష్టంచేస్తున్నదన్నారు.

అమెరికా కూడా అణ్వస్త్ర పరీక్షలను ప్రారంభించ నిశ్చయించుకొందని ఈ ప్రకటనలో తెలుపలేదు. అటువంటి నిర్ణయం ఎప్పుడు జరిగేదీ తెలుపడానికి అధ్యక్ష కార్యాలయోద్యోగి నిరాకరించాడు.

'అయితే వచ్చే 24 గంటల్లోనూ కెన్నడీ, తన ప్రధాన సలహాదారులతో సమాలోచనలు జరుపుతా రన్నాడు.

ఈ ప్రకటన జరగడానికి ముందు తాను మామూలు ప్రకారం జరిపిన పత్రికాగోష్ఠిలో కెన్నడీ అణ్వస్త్రాల సమస్యను గురించి ప్రస్తావించారు. సోవియట్‌తో ఒడంబడిక కుదిరేదీ, లేనిదీ వచ్చేవారంలో తేలుతుందన్నారు.

ఆ పత్రికా గోష్ఠి జరుగుతూన్న సమయంలోనే, సోవియట్ నిర్ణయం గురించి తొలివార్త తమ కందిందని అధ్యక్ష కార్యాలయోద్యోగి తెలిపారు. ఆవార్తఎలాఅందిందీ వెల్లడిచేయనిరాకరించాడు. అధ్యక్ష కార్యాలయంలోని ఇద్దరుముగ్గురికి మాత్రమే ముందు ఆ భోగట్టా అందిందన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలీగ్‌ను పునరుద్ధరించి ఎన్నికలలో పాల్గొనే సన్నాహాలు చేస్తున్నారు

ఉన్న హక్కులను ఊడబెరికే మద్రాసు భూసంస్కరణల బిల్లు

ప్రణాళికశాఖామంత్రి శ్రీ నందాకు కిసాన్ సభాధ్యక్షుడు శ్రీ గోపాలన్ లేఖ

మద్రాసు, ఆగస్టు 30

"మద్రాసు భూమి సంస్కరణల బిల్లులో కొన్ని ప్రధానమైన మార్పులు తీసుకొని వచ్చేటట్టు ప్రణాళిక సంఘం చూడాలి" అని అఖిల భారత కిసాన్‌సభ అధ్యక్షుడు శ్రీ ఎ కె గోపాలన్ ప్రణాళిక మంత్రి శ్రీ నందాకు వ్రాసిన ఒక లేఖలో తెలియజేశారు.

భూమిని దున్నేవారికి రక్షణ కల్పించాలనీ, పంటలు అధికం చేయడానికిగల అవరోధాలను తొలగించాలని తృతీయ ప్రణాళికలో చేర్చిన్న విషయాలను శ్రీ గోపాలన్ ఈ లేఖలో ఉదహరించారు.

శ్రీ కె టి కోసలరామ్, యమ్ కళ్యాణసుందరం గార్లు ఈ బిల్లుపై సెలెక్టు కమిటీలో వెలిబుచ్చిన భిన్నాభిప్రాయాలను శ్రీ గోపాలన్ ఉదహరించుతూ, ఈ బిల్లు యథాతథంగా కౌలుదార్ల ఆశలను వమ్ముచేయడమే గాక ఉన్న హక్కులనుకూడా తీసివేస్తుందని అన్నారు. ప్రభుత్వం ఏ ఉద్దేశ్యాలతోనైతే భూసంస్కరణలను తలపెట్టిందో ఆ ఆశయాలను త్రోసిరాజంటున్నదనీ మరింతగా సాంఘిక, ఆర్థిక అసమానతలను పెంచుతుందనీ అన్నారు.

ప్రణాళికాసంఘం నిజంగా నిజాయితీగాఉంటే ఈవిషయంలో తప్పక తగు చర్య తీసుకోవాలి. అందుచేత ఈఆఖరిక్షణంలోనైనప్పటికీ ప్రణాళికా సంఘం జోక్యంకల్గించుకొని మద్రాసు భూసంస్కరణలచట్టం కనీసం ఇప్పుడున్న హక్కులనైనా నిర్మూలించకుండా చూడాలని కోరుతున్నాను"

ఈ లేఖను తమిళ్‌నాడు కమ్యూనిస్టు కమిటీ పత్రికలకు విడుదల చేసింది

బెల్గ్రేడ్ సభకు కెన్నెడీ స్వాగతం

వాషింగ్టన్, ఆగస్టు 30

"మానవజాతి నెదుర్కొంటున్న సమస్యలనుగురించి ఆలోచించడానికి ప్రపంచంలోని బాధ్యతగల నాయకులు సమావేశం కావడం ఎల్లప్పుడూ ఆశాజనకంగానే ఉంటుంద"ని అమెరికా అధ్యక్షుడు కెన్నడీ నేడు తన పత్రికాగోష్ఠిలో అన్నారు.

సెప్టెంబరు మొదటి తేదీన బెల్గ్రేడ్‌లో ప్రారంభంకానున్న తటస్థ రాజ్యాల శిఖరాగ్ర సమావేశం గురించి వ్యాఖ్యానిస్తూ ఆయన అలా అన్నారు.

"స్వప్రయోజనాలకోసం ఇతరులను దోచుకోవడం ఏ రూపంలో ఉన్నా, దానిని నిర్మూలించేందుకే అమెరికా తన బలంకొలదీనంతా ఉపయోగిస్తుంద"ని కెన్నడీ అన్నారు.

తమకు నచ్చిన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలనూ, జీవన విధానాన్నీ, తాము ఎంచుకోగల హక్కు అన్ని దేశాలకూ వుండాలన్నదే మొదటినుండీ అమెరికా అభిలాష అనీ, బెల్గ్రేడ్ సమావేశం ఈ లక్ష్యసిద్ధిని చేకూర్చ గలదని ఆశిస్తున్నానని ఆయన అన్నారు.

నిర్బంధ ప్రాథమిక విద్యా వ్యాప్తికి ప్రదేశాల నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 8

1961 విద్యా సంవత్సరం మొదటి దినంనుండీ యీ క్రింద తెలిపిన ప్రాంతాలలో నిర్బంధోచిత ప్రాథమిక విద్యా పథకాన్ని అమలు పరచాలని ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఐదవ తరగతి వరకు ప్రాథమిక విద్య 1954 జూలై 1వ తేదీ 1955 సెప్టెంబరు 1వ తేదీల మధ్య పుట్టిన బిడ్డలందరికీ నిర్బంధమవుతుంది.

(1) హైదరాబాద్ జిల్లాలో మోమిన్‌పేట పంచాయతీసమితి బ్లాక్, (2) మహబూబ్‌నగర్ జిల్లాలో షాద్‌నగర్ పంచాయతీ సమితి బ్లాకు, (3) నెల్లూరుజిల్లాలో పొదిలి పంచాయతీసమితిబ్లాకు, (4) నెల్లూరుజిల్లాలో ఉదయగిరి పంచాయతీ సమితిబ్లాకు (5) కాకినాడ విద్యాజిల్లాలో తాళ్ళరేవు పంచాయతీ సమితిబ్లాకు, (6) చిత్తూరు పంచాయతీ సమితి బ్లాకు, (7) గుంటూరు జిల్లాలో పల్లపట్ల పంచాయతీసమితి బ్లాకు, (8) చిత్తూరు జిల్లాలో కాటూరు పంచాయతీ సమితి బ్లాకు (9) అనంతపురం జిల్లాలో కొడిగెనహళ్లి పంచాయతీబ్లాకు, (10) కర్నూలు జిల్లాలో కొమరోలు పంచాయతీ సమితి బ్లాకు, (11) చిత్తూరు జిల్లాలో కార్వేటి నగరం పంచాయతీ బ్లాకు, (12) గుంటూరు జిల్లాలో వినుకొండ పంచాయతీ బ్లాకు.

వెకో విరోచన చాక్లెట్. కడుపులో మెలిపెట్టదు
తియ్యగావుండును అన్నికొట్లలో దొరకును
ఇండియన్ డ్రగ్ కంపెనీ, విజయవాడ-2

పంటకాల్వలనుండి నీరు తోడేందుకు ఉపయోగపడు
లోహెడ్ పంపులు ఇంపోర్టు చేయబడినవి
"వర్దింగ్టన్ సింప్సన్" హైవ్ యర్ డి 6, 8"×6" డైరెక్టు కప్లింగ్ చేయవచ్చును మరియు 'పల్సో మీటరు' టైప్ ఇ 6 ఫాస్ట్ & లూజ్ పుల్లీతో బెల్టుడ్రైవెన్ మావద్ద లభించును
జి జాన్సి అండ్ కో,
2/163, మౌంట్‌రోడ్ మద్రాస్-2

దిగువ వ్యాధులతో
అనగా 1 పక్షవాతం. 2. ముఖం, మెడ, నడుం, అవయవాలు, సగభాగం శరీరం శరీరమంతా పక్షవాతం. 3 అధిక రక్తం పోటు 4 చెవుడు. 5 మూగ. నత్తి 6 గ్రుడ్డి. మెల్లకన్ను, 7. మెదడు జబ్బు వగయిరాలతో బాధపడే రోగులు కవిరాజ ఓంప్రకాశ్, ఎం ఏ. భిషగాచార్య ధన్వంతరి రిజిస్టర్డు ప్రాక్టిషనర్ (ఢిల్లీ)వారిని దిగువచోట్ల సంప్రతించండి.
న్యూఢిల్లీ - ప్రతినెల 1 నుంచి 5 తేదీ
హైదరాబాద్ - 7-9-61 ఉదయము 10 నుంచి మ 1 గం తాజమహల్ హోటల్. కింగ్‌కోటిరోడ్డు. ఫోన్ 5591
గుంతకల్లు 8-9-61 మ 12 గం నుంచి సా 4 గం శ్రీ శివశంకరవిలాస్
నరసరావుపేట - 9 9 61 మ 12గం నుంచి సా 4 గం పెద తదేవహోటల్
విజయవాడ - 10 9 61 ఉ 8 గం నుంచి 12 గం మోడరన్ కేఫ్, గవర్నర్ పేట, ఫోన్ 174-A
రాజమండ్రి 11-9 61 ఉ 8 గం నుంచి మ 12 గం శాంతినివాస్, ఫోన్ 2?-A
కాకినాడ - 12-9 61 ఉ 7 గం నుంచి 11 గం రావ్స్ ఎం ఎల్ హోం. మెయిన్ రోడ్డు, ఫోన్: 88
విశాఖపట్నం - 13-9 61 ఉ 8 గం నుంచి 12 గం రత్న విహార్, ఫోన్ 618 A
సంప్రతింపు రుసుము, చికిత్స ఛార్జీలు. సాహిత్యం మొదలైన యితర వివరములకు 25 న పై స్టాంపులు పంపండి
ARYAVARTA POLIO ASHRAM,
ARYAVARTA BHAVAN
79-E, Kirti Nagar New Delhi-15
Phones: 54344 & 54564 'Grams 'POLIOCURE'
An Illustrated publication 'Poliomyelitis & Ayurveda' (English) on the treatment of above complaints, Price Rs 7 50 np Postage 90 np

మీరు ఈ నెల ప్రీమియం చెల్లించాలి కదూ?
అయితే సకాలములో ప్రీమియం నోటీసులో సూచించిన కార్యాలయములో మాత్రమే చెల్లించండి.
ఎప్పుడూ కూడ ప్రీమియం నోటీసు జతపరచండి. ఆ నోటీసు మీ వద్ద లేకపోతే క్రింది వివరాలు తెలుపుతూ సరైన కార్యాలయములో ప్రీమియం చెల్లించండి
● మీ పట్టా నెంబరు
● గడువు తేదీ
● చెల్లించు విధము (మాసవారి త్రైమాసికము, అర సం రం, సాలీనా)
● యూనిటు పేరు (ఏ యూనిట్ మీ పట్టా వ్యవహారాలు చూస్తున్నదో)
ప్రీమియం వసూలు చేయుటకు కార్పొరేషను చే అనుమతించబడిన బ్యాంకు ద్వారా చెల్లించదలచిన పై సూచించిన వివరాలన్నీ బ్యాంకునకు తెలుప, వెంటనే అందువల్ల ఆ బ్యాంకు సరైన కార్యాలయమునకు సమాచారము పంపుట సులభమగును
ప్రీమియం నోటీసు మీకు అందక పోతే దానికొరకు మీరు ఆగవద్దు
సకాలములో ప్రీమియం చెల్లించండి
జీవిత భీమా — మీరు భీమా చేసిన నాడే మీకు రక్షణ
ASP/LIC/AS-140 TEL

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి, విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ-2

గోదావరి వరద తగ్గుముఖం

భద్రాచలం, ఆగస్టు 28

గోదావరి వరద ఈరోజు ఉదయానికి తగ్గుముఖం పట్టింది. నేటి ఉదయం నీటిమట్టం 47 అడుగులు ఉన్నది.

గోదావరికి వరద గత వారం రోజులలోనూ మూడుసార్లు వచ్చింది. నీటిమట్టం భద్రాచలంవద్ద 52 అడుగుల వరకు పెరిగింది.



సంగీతనాటక అకాడమీ మాజీ ఉద్యోగులపై కేసు

దొంగలెక్కలువ్రాసి డబ్బుకాజేశారని ఛార్జిషీటు

న్యూఢిల్లీ, ఆగస్టు 30

సంగీత నాటక అకాడమీ కార్యదర్శిగా పనిచేసిన కుమారి నిర్మలజోషి, అకౌంట్సుగా పనిచేసిన శ్రీ హెచ్. బి. నిర్మల్, జైగోపాల్ కపూర్ గార్లు దొంగలెక్కలు చూపించి అకాడమీకి చెందిన డబ్బు లక్షా 90 వేలు కాజేశారని పోలీసులు గత మంగళవారం ఢిల్లీ మేజస్ట్రేట్ కోర్టులో కేసు పెట్టారు. వీరిని మేజస్ట్రేటు జామీను పై వదిలి పెట్టారు.

పోలీసు స్పెషల్ సిబ్బంది గత సంవత్సరంనుండి ఈ సంగీత నాటక అకాడమీ లెక్కలను గురించి దర్యాప్తు జరుపుతూ వుంది. గత సంవత్సరం కుమారి జోషి, కార్యదర్శి పదవికి రాజీనామా ఇచ్చింది.

1954 నుండి 1960 వరకు వీరు ముగ్గురూ కలిసి సంగీత నాటక నృత్య సంస్థలకు అకాడమీ గ్రాంట్లు చెల్లించినట్లు దొంగలెక్కలు చూపుతూ వచ్చారనీ, ఈ డబ్బు కాజేశారనీ పోలీసు అధికారులు తమ ఛార్జిషీటులో పేర్కొన్నారు.

అక్షరాస్యుల శాతంలో పెరుగుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 29

1961 సంవత్సరపు జనాభా లెక్కలలో అక్షరాస్యుల శాతంలో కన్పించిన పెరుగుదల పూర్వపు ఏ జనాభా లెక్కలనుబట్టి చూచినా కూడా ఎక్కువగానే ఉన్నదని ఈవేళ రాజ్యసభలో కేంద్ర విద్యామంత్రి డాక్టర్ కె. ఎల్. శ్రీమాలి శ్రీ అన్వారుద్దీన్ అహమ్మద్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ తెలియజేశారు.

కేంద్రమంత్రి డాక్టర్ కె. ఎల్. శ్రీమాలి ఈక్రింది వివరాలుకూడా తెలియజేశారు.

1901 లో అక్షరాస్యుల శాతం 7.01
1911 లో అక్షరాస్యుల శాతం 7.3
1921 లో అక్షరాస్యుల శాతం 9.4
1931 లో అక్షరాస్యుల శాతం 10.5
1951 లో అక్షరాస్యుల శాతం 16.6
1961 లో అక్షరాస్యుల శాతం 23.7

సెప్టెంబరు పరీక్షల్లో ప్రైవేట్ అభ్యర్థుల హాలు టిక్కెట్లు

హైదరాబాద్, ఆగస్టు 30

1961 సెప్టెంబర్లో జరుగనున్న ప్రీయూనివర్సిటీ కోర్సు (హ్యుమానిటీస్), బి. ఎ. (2, 3 సంవత్సరాల డిగ్రీకోర్సు) పరీక్షలకు హాజరయ్యే ఉపాధ్యాయుల ప్రైవేటు అభ్యర్థుల హాల్ టికెట్లు, వారు తమ దరఖాస్తులలో ఇచ్చిన అడ్రెసులకు పంపబడ్డాయి. అవసరమైన పత్రాలను పంపని అభ్యర్థులకు మాత్రం హాలు టికెట్లు పంపలేదు.

పరీక్షలు ప్రారంభమయ్యే తేదీకి (11-9-61) ఒకవారం రోజులు ముందుగా హాల్ టికెట్లు అందనివారు, ఉస్మానియా యూనివర్శిటీ పరీక్షల కంట్రోలర్‌ను చూడవలసిందిగా యూనివర్శిటీ అధికారులు తెలియజేస్తున్నారు. (వి. వి.)

ప్రాచ్య భాషావేత్తల అంతర్జాతీయ మహాసభ

1963 లో ఢిల్లీలో ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ప్రాచ్యభాషావేత్తల 26వ అంతర్జాతీయ మహాసభ ఢిల్లీలో 1963లో జరుగుతుంది. ఈ మహాసభలో ఈజిప్టు, భారతదేశాల ప్రాచీన చరిత్ర, భాషా సంస్కృతులగూర్చి చర్చిస్తారు.

ఆగ్నేయాసియా, దూర ప్రాచ్య దేశాల, ఆఫ్రికా, ఇస్లాం మతం కిందలగు విషయాలపైన కూడా చర్చలు జరుగుతాయి.

ఈవిషయం నేడు కేంద్ర శాస్త్రీయ పరిశోధనా మంత్రి శ్రీ హుమాయూన్ కబీర్ లోక్‌సభలో తెలియజేశారు.

హోటల్ పనివారికి ప్రావిడెంట్ నిధి పథకాన్ని అమలుజరుపవలసిందిగా కోరుతూ బొంబాయిలో హోటలు పనివారు సభలు జరిపారు.



జైహింద్‌టాకీస్ - విజయవాడ
శేష్‌మహల్ - గుంటూరు
వినాయకసినిమా - నెల్లూరు
గెయిటీ థియేటర్ - తెనాలి
రమామహల్ - ఏలూరు
సరస్వతీటాకీస్ - మచిలీపట్నం
గౌరీశంకరటాకీస్ - గుడివాడ
గోవర్ధనపిక్చర్‌పాలెస్-భీమవరం
వీరభద్రా పిక్చర్‌పాలెస్ - రాజమండ్రి
సినిమా మెజిస్టిక్ - కాకినాడ
సరస్వతీ పిక్చర్‌పాలెస్ - విశాఖపట్నం
న్యూపూర్ణాథియేటర్ - విజయనగరం
జైహింద్‌టాకీస్ - అనకాపల్లి
రామకృష్ణాథియేటర్ - శ్రీకాకుళం
గోపాలకృష్ణాటాకీస్ - చీరాల
కృష్ణాటాకీస్ - అమలాపురం
రాధాకృష్ణాటాకీస్ - కర్నూలు
సరస్వతీటాకీస్ - కడప
రీగల్‌టాకీస్ - గుంతకల్

నేటినుండి
దీపక్‌మహల్ - హైద్రాబాద్
చిత్రాటాకీస్ - సికింద్రాబాద్
మార్కండేయటాకీస్ - వరంగల్


నేడే చూడండి
మ్యాట్నీతో ప్రారంభం
అసాధారణ సాహస కృత్యాలతో నిండి యున్న చిత్రం.....
విశ్వశాంతి వారి
నిర్మాత.. U.విశ్వేశ్వరరావు B.Sc.
రిలీజ్:- ఆంధ్ర... పరమేశ్వరి సీడెడ్..భాస్కర్ * నైజాం..అన్నపూర్ణ
మాటలు,పాటలు.. సముద్రాల జూనియర్&సీనియర్ * సంగీతం.. పామర్తి * దర్శకుడు.. తిరుముగం.
REVATHI